www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 16 ఏప్రిల్ 2024

8 పేజీలు

ఏలూరు

పశ్చిమ గోదావరి

బాబోయ్ చదువు 'కొన'లేం..!

విద్యను ప్రయివేటీకరణ చేయడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించుకోలేని పరిస్థితి ఏర్పడింది. ప్రయివేటు స్కూళ్లలో ఎల్‌కెజికి సైతం అడ్డగోలుగా రూ.వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్నా అడిగే నాథుడే లేకుండా పోయాడు. ఫీజులకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలు ఎక్కడా అమలుకాని పరిస్థితి. స్కూల్‌తోపాటు, ఇంటర్ విద్యలో ఫీజుల దోపిడీ మరింత దారుణంగా తయారైంది. రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తుండడంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు తమ పిల్లలను చదివించేందుకు అప్పులపాలవుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో తల్లిదండ్రులంతా బాబోయ్ చదువు 'కొన'లేం అంటూ తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు,

స్కూల్, ఇంటర్ ఫీజులపై తల్లిదండ్రుల ఆందోళన

ఎల్‌కెజి ఫీజు సైతం రూ.30 వేలు పైనే

ఇంటర్ డేస్కాలర్‌కు రూ.70 వేలు, హాస్టల్‌కు రూ.2.50 లక్షలు

పుస్తకాలు, రవాణా, ఇతరాల పేరుతో భారీ దోపిడీ

ప్రయివేటు స్కూళ్లు, కాలేజీలపై కొరవడిన అజమాయిషీ

ఏ స్కూల్లోనూ కనిపించని ఫీజుల డిస్‌ప్లే బోర్డు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వెయ్యి వరకూ ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లు ఉన్నాయి. దాదాపు రెండు లక్షల మంది విద్యార్థులు ప్రయివేటు స్కూళ్లలో విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్యనందించడంలో పాలకులు విఫలమవ్వడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రయివేటు స్కూళ్లలో చేర్చేందుకు మక్కువ చూపుతున్నారు. ఇదే అదునుగా ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యం దోపిడీకి అంతూపొంతూలేకుండా పోయింది, సాధారణ కాన్వెంట్‌లో సైతం ఎల్‌కెజికి రూ.20 వేలుపైనే వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ స్కూళ్లలో అయితే ఎల్‌కెజికి రూ.50 వేల వరకూ గుంజుతున్న పరిస్థితి. తరగతులు పెరిగే కొద్దీ ఫీజుల బాదుడు పెరుగుతోంది. స్కూల్ స్థాయిలోనే ఐఐటి అంటూ భారీగా ఫీజులు వసూలు చేస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. తల్లిదండ్రులు తమ ఇద్దరు పిల్లలకు చదువు కోసం ఏడాదికి తక్కువగా లెక్కించినా రూ.రెండు లక్షల ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానికి పిల్లల చదువులు పెనుభారంగా మారాయి. ప్రతిస్కూళ్లలోనూ ఫీజులకు సంబంధించిన వివరాలను డిస్‌ప్లే చేయాలని నిబంధన ఉన్నప్పటికీ ఎక్కడా అది జరగడం లేదు. విద్యాశాఖ అధికారులు సైతం పట్టించుకోని పరిస్థితి నెలకొంది. విద్యార్థుల నుంచి రూ.వేలు, రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నా ప్రయివేటు స్కూళ్లలోని సౌకర్యాలపైనే అధికారుల తనిఖీలు అనేవి లేకుండా పోయాయి. బుక్స్, బెల్టు, బ్యాగులు వంటివిసైతం స్కూళ్లలోనే విక్రయిస్తున్నారు. స్కూళ్లలో విక్రయించే వస్తువులనే కొనుగోలు చేయాలన్న నిర్బంధం పెడుతున్నా అడిగేనాథుడే లేకుండా పోయాడు. ఇదంతా బహిరంగానే జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రయివేటు స్కూళ్లపై ప్రభుత్వ పర్యవేక్షణ లేకుండా పోయిన పరిస్థితి నెలకొంది. దీంతో పేద, మధ్యతరగతి ప్రజానీకం తమ పిల్లలను చదివించుకునేందుకు అప్పులు చేయాల్సిన దుస్థితి దాపురించింది. చదువుల కోసం ఉన్న ..6లో

ఏలూరు కలపర్రు టోల్‌గేటు వద్ద జిల్లాలోకి ప్రవేశించిన బస్సు యాత్ర

జిల్లాలోకి ప్రవేశించిన సిఎం బస్సు యాత్ర

నారాయణపురంలో కరెంట్ ఆగడంతో ఒక్క నిమిషం కలకలం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ఏలూరు అర్బన్, సిటీ, ఉంగుటూరు, భీమడోలు

సిఎం జగన్ చేపట్టిన ఎన్నికల బస్సుయాత్ర సోమవారం సాయంత్రం 7.45 గంటలకు కలపర్రు టోల్ గేటు వద్ద ఏలూరు జిల్లాలోకి ప్రవేశించింది. ఆయనకు స్వాగతం పలికేందుకు నాయకులు, కార్యకర్తలు గజమాలలతో అక్కడికి చేరుకున్నప్పటికీ సిఎం బయటకు రాలేదు. బస్సు అక్కడ ఆగకుండా ముందుకు నడిచింది. ఆశ్రం ఆసుపత్రి వద్ద సైతం కార్యకర్తలు, నాయకులు స్వాగతం పలికేందుకు చూసినప్పటికీ బస్సులోంచి సిఎం అభివాదం చేస్తూ ముందుకు సాగారు. గుండుగొలను, నారాయణపురం మీదుగా బస్సు యాత్ర సాగింది. రాత్రికి నారాయణపురంలోనే సిఎం రాత్రి చేశారు. ఆయన బస ప్రాంతంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు సిఎం బస్సు యాత్ర మరలా ప్రారంభం కానుంది. రాచూరు, గణపవరం, ఉండి మీదుగా సిఎం బస్సు యాత్ర భీమవరం చేరుకోనుంది. సాయంత్రం నాలుగున్న గంటలకు భీమవరంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడతారు. సభ అనంతరం ఆయన గరగపర్రు, పిప్పర, ముదునూరు, తణుకు మీదుగా రాజమండ్రి చేరుకుని రాత్రి అక్కడ బస చేస్తారు. సిఎం పర్యటన నేపథ్యంలో ఎక్కడికక్కడే పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

కారు అద్దంలోకి దూసుకెళ్లిన కార్యకర్త

కరెంట్ ఆగడంతో ఒక్క నిమిషం కలకలం

కృష్ణా జిల్లాలో పర్యటన ముగించుకుని ఏలూరు జిల్లాలో అడుగుపెట్టిన సిఎం బస్సు యాత్ర 9.15 నిమిషాలకు ఉంగుటూరు మండలం నారాయణ పురం చేరుకుంది. అక్కడ నాలుగు రోడ్ల కూడలిలో బస్సు ఆగడంతో జగన్ బస్సు పైకి ఎక్కి అభివాదం చేస్తుండగా కరెంట్ పోయింది. దీంతో సిఎం రక్షణ సిబ్బంది, పోలీసులు ఒక్కసారిగా అప్రమత్తమాయ్యరు. రెండు రోజుల క్రితం విజయవాడలో జరిగిన సిఎం బస్సు యాత్రలోనూ కరెంటు లేని సమయంలో ఆయనపై రాయి విసిరిన ఘటన రాష్ట్రంలో సంచలనం రేపింది. అదేవిధంగా నారాయణపురంలో కరెంటుపోవడంతో ఒక్కసారిగా అందరిలోనూ ఇదే చర్చనీయాంశమైంది. వెంటనే ఒక ..6లో

18 నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం

కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుందని, ఈ నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపటామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని, 18వ తేదీ నుంచి నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. నామినేషన్ల దాఖలకు చివరి తేదీ 25వ తేదీ అని, 26న నామినేషన్లను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ల ఉపసంహారణకు చివరి తేదీ 29వ తేదీ అని, మే 13న పోలింగ్ జరుగుతుందని, జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు నామినేషన్ల దాఖలకు 13 రకాల డాక్యుమెంట్లు తీసుకురావాలని, అన్ని రకాల డాక్యుమెంట్లూ సక్రమంగా ఉంటే నామినేషన్లను అనుమతించడం జరుగుతుందని తెలిపారు. చివరి రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ మాత్రమే నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని, మూడు గంటల కన్నా ఒక్క సెకండ్ దాటినా ఎన్నికల కమీషన్ సూచనల మేరకు నామినేషన్ తీసుకోవడానికి అవకాశం ఉండదని చెప్పారు. పార్లమెంటరీ నియోజకవర్గం కోసం ఫారం-2 ఎ, అసెంబ్లీ నియోజకవర్గం కోసం ఫారం-2 బి సమర్పించాలని, నోటిఫైడ్ తేదీల్లో ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ నామినేషన్లు స్వీకరించడం జరుగుతుం దని తెలిపారు. సెలవు దినాల్లో నామినేషన్లు స్వీకరించబడవని తెలిపారు. అభ్యర్థులు గరిష్టంగా 4 సెట్ల నామినేషన్ ..6లో

అన్నింటా తలదన్నేలా.. తణుకు

మధ్యపేజీల్లో..

ఉపాధి హామీ కూలి రూ.600 ఇవ్వాలి

8లో..

ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల దోపిడీ అరికట్టాలి

8లో..

ప్రేమ పేరుతో మోసం

ప్రియుడి ఇంటి ముందు గిరిజన యువతి బైఠాయింపు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ప్రేమ పేరుతో మోసగించిన ప్రియుడి ఇంటి ముందు గిరిజన యువతి బైఠాయించారు. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం దొరమామిడి పంచాయతీ రంగాపురం గ్రామానికి చెందిన రమ్యభారతి, కొయ్యలగూడెం మండలం బోడిగూడెం గ్రామానికి చెందిన మెంటి సాయిభవాని (సాయి) కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుందామని రమ్య భారతితో చెప్పి ఇరు కుటుంబసభ్యులను ప్రియుడు ఒప్పించారు. అయితే అప్పటికే రమ్యభారతి ఆరు నెలల గర్భిణీ. పరీక్షలకు తీసుకెళ్తున్నామని చెప్పి సాయి కుటుంబసభ్యులు దేవరపల్లిలోని ఓ క్లినిక్ తీసుకెళ్లారని, మత్తు మందు ఇచ్చి అబార్షన్ చేయించారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. జాబ్ చేయాలని, తరువాత పెళ్లి చేసుకుందామని చెప్పి తనను సాయి హైదరాబాద్‌కు పంపించాడని, వారం రోజుల క్రితం అతను మరొకరిని పెళ్లి చేసుకున్నాడని చెప్పారు. తనకు న్యాయం చేయాలని బోడిగూడెంలో ప్రియుడి ఇంటి వద్ద ప్రియురాలు బైఠాయిం చారు. కొయ్యలగూడెం పోలీసులు ఘటనా ..6లో

ప్రతి ధాన్యపు గింజా కొంటాం

వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు షేక్ హబీబ్ బాషా

ప్రజాశక్తి - భీమడోలు

నాణ్యతా ప్రమాణాలకు లోబడి పండిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు షేక్ హబీబ్ బాషా హామీ ఇచ్చారు. ఆయన భీమడోలు మండలంలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలలో ధాన్యాన్ని ఆరబోసిన రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు విషయమై రైతులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. తేమ శాతం లెక్కింపు, అందుబాటులో గల గోనె సంచులు, ధాన్యం రవాణా ఇతర అంశాలపై రైతులతోను, వ్యవసాయ అధికారులతోను చర్చించారు. అనంతరం సూరప్పగూడెంలోని రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ గల సచివాలయ వ్యవసాయ సహాయకులు శైలు భాను తేమ శాతం లెక్కింపు, రైతుల అవసరాల మేరకు ధాన్యం సంచులను అందుబాటులో ఉంచటం అంశాలను వివరించారు. రైతు భరోసా కేంద్రం ద్వారా సేకరించిన సుమారు 30 టన్నుల ధాన్యాన్ని, రవాణాకు అవసరమైన రవాణా వాహనాలను సిద్ధం చేయడం వంటి అంశాలను వివరించారు. భీమడోలు వ్యవసాయ అధికారి ఉషారాణి మాట్లాడుతూ మండల పరిధిలో ఇంతవరకు 6,440 ఎకరాల విస్తీర్ణంలో కోతలు పూర్తయ్యాయని తెలిపారు. రైతుల అవసరాల కోసం మండల పరిధిలోని 13 రైతు భరోసా కేంద్రాల వద్ద ఐదు లక్షల గోనె సంచులు సిద్ధం చేశామని తెలిపారు. ఇంతవరకు 5,086 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి మిల్లులకు తరలించినట్లు వివరించారు. వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు పి.ఉషా రాజకుమారి, భీమడోలు సబ్ డివిజన్ పరిధిలో ధాన్యం కొనుగోళ్లు, ఇతర పరిస్థితులను సంయుక్త సంచాలకుల దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో భీమడోలు సాంకేతిక వ్యవసాయ అధికారి ప్రవీణ్ పాల్గొన్నారు.

ధాన్యం ఆరుదల శాతం పరిశీలిస్తున్న షేక్ హబీబ్ బాషా


దుస్తులు పంపిణీ చేస్తున్న రాజారావు

వృద్ధులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలులో అంబేద్కర్ జయంతి కార్యక్రమాలు సోమవారం కూడా కొనసాగాయి. దీనిలో భాగంగా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.రాజారావు తమ సీనియర్, ఉభయ రాష్ట్రాల హైకోర్టు సీనియర్ న్యాయవాది జి.రోనాల్డ్ రాజు సహాయ సహకారాలతో భీమడోలు వంతెన వద్ద వేసవి సేద పేర ఒక చలివేంద్రాన్ని ఏర్పాటుచేసి ప్రారంభించారు. ఇదే క్రమంలో అర్జావారిగూడెంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి సత్కరించారు. ఆయన సంస్కరణార్థం వృద్ధులకు కండువాలు, వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియలో జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల సిబ్బందికి నామినేషన్ల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ రవి కిరణ్ సింగ్ మాట్లాడుతూ ఎన్నికల తొలి ప్రక్రియగా నామినేషన్లు ప్రారంభమవుతాయన్నారు. నామినేషన్ల స్వీకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తినట్లయితే అధికారులను సంప్రదించాలని తెలిపారు.

సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

ట్రిపుల్ ఐటిలో ముగిసిన టెక్ జైట్-24

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు ట్రిపుల్ ఐటీలో రెండు రోజులుగా నిర్వహించిన టెక్ జైట్-24 సోమవారం ముగిసింది. దీనిలో విద్యార్థులు పలు ఈవెంట్లను నిర్వహించడంతో పాటు, వర్క్ షాప్ గెస్ట్ లెక్చరర్‌ను చేపట్టారు. ఈ ఈవెంట్ వర్క్ షాప్ విజేతలకు డైరెక్టర్ చంద్రశేఖర చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ జ్యోతి లాల్ నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎల్‌సి జయమంగళ పుట్టినరోజు

ప్రజాశక్తి - కైకలూరు

వైసిపి ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆట పాక ఆయన నివాసంలో జరిగిన వేడుకల్లో శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైసిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు.

కేక్ కట్ చేస్తున్న ఎంఎల్‌సి

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

రివాల్వింగ్ విధానం..

ఫోమ్ విన్యాసం..

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు అగ్నిమాపక కేంద్రం అధికారి జి .నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు సోమవారంతో రెండవ రోజుకి చేరాయి. దీనిలో భాగంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఆస్తి, ప్రాణాలను కాపాడే క్రమంలో అగ్నిమాపక సిబ్బంది చేపట్టే వివిధ అంశాల గురించి భీమడోలు బస్టాండ్ వద్ద డెమో ప్రదర్శన నిర్వహించారు. దీనిలో భాగంగా 30 మీటర్ల ఎత్తులో సైతం అగ్ని ప్రమాదం జరిగినప్పుడు దానిని అదుపు చేసేందుకు వినియోగించే సింగిల్ జెట్ విన్యాసం, తక్కువ ఎత్తులో అగ్నిప్రమాదం జరిగినప్పుడు తక్కువ నీటి వినియోగంతో మంటలను అదుపు చేసే రివాల్వింగ్ విధానంలో భాగంగా వినియోగించే కంట్రోల్ బ్రాంచ్ పైపులైన్ విన్యాసం, తీవ్రత తక్కువగా గల అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వాటి మధ్యకు వెళ్లి మంటలను అదుపు చేసే క్రమంలో సిబ్బందికి రక్షణ కలిగించే ట్రిపుల్ జెట్ అంబరిల్లా(గొడుగు) విన్యాసం, రసాయన, ప్రమాదాన్ని అదుపు చేసేందుకు నీటిని వినియోగించే అవకాశం లేని సమయంలో వినియోగించే ఫోమ్ జెట్(నురగను వినియోగించే) విన్యాసాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం సహాయ అధికారి నాగబాబుతో పాటు వివిధ కేడర్లకు చెందిన అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

సింగిల్ జెట్ విధానం

రాజారావుకు పరామర్శ

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని పోలవరం గ్రామానికి చెందిన సిపిఎం మండల కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు చాగంటి రాజారావు మాతృమూర్తి చాగంటి అనసూయమ్మ కీర్తిశేషులు అవ్వడంతో సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి సోమవారం రాజారావును పరామర్శించారు. పోలవరం గ్రామంలోని చాగంటి రాజారావు గృహానికి వెళ్లి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

టిడిపిలోకి పలువురు

ప్రజాశక్తి - ముసునూరు

మండలానికి చెందిన పలువురు టిడిపిలోకి చేరారు. టిడిపి నూజివీడు కార్యాలయంలో చాట్రాయి మండలం చిత్తపూరు గ్రామానికి చెందిన చిలకంటి కాశీలు, బత్తుల శివ సత్యనారాయణ, బత్తుల కిరణ్ కుమార్, ఆడిమెల్లి సురేష్, పొట్లపుల సుబ్బారావు, కొత్తపల్లి శోభనాచలం, ఆడిమెల్లి నరేష్‌లు సోమవారం టిడిపి నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారధి సమక్షంలో టిడిపిలోకి చేరారు.

'రాష్ట్రాభివృద్ధికి కలిసి పనిచేయాలి'

ప్రజాశక్తి - కైకలూరు

రాష్ట్రాభివృద్ధి కోసం ప్రజలు కలిసి పనిచేయాల్సి ఉందని నేతలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సిఎన్ఆర్ గార్డెన్స్‌లో నియోజకవర్గం వెలమ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బిజెపి అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌సి మాధవ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడతూ నీతికి నిజాయితీకి మారు పేరు మీరు. చరిత్రలో వెలమలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. వైసిపి ప్రభుత్వాన్ని నమ్ముకున్న ప్రజలు పూర్తిగా మోసపోయారన్నారు. పేద ప్రజలకు కనీసం గుక్కెడు మంచినీళ్లు కూడా ఇవ్వలేని దౌర్భాగ్యపు జగన్ ప్రభుత్వం అని విమర్శించారు. వైసిపి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, రాష్ట్రంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా జరగలేదని తెలిపారు. ఎపికి ఒక్క కంపెనీ కూడా రాలేదన్నారు. కులం, మతం, ప్రాంతం అనే భేదం లేకుండా మనమందరం కలిసి రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పని చేయాలని అన్నారు. నియోజవర్గంలో కుటుంబ పాలన సాగుతుంది అనంతరం బిజెపిలోకి కామినేని శ్రీనివాస్ సమక్షంలో వైసిపి నుంచి జెడ్‌పిటిసి సభ్యురాలు కూరేళ్ల బేబి, ప్యాట్రిక్ పాల్ చేరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వెలమల సంఘం నాయకులు, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిశుసంరక్షణ కేంద్రానికి బాలిక తరలింపు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

స్థానిక రెడ్డి గణపవరం గ్రామంలో మార్చి నెలలో జరిగిన రెడ్డిగణపవరం తిరణాళ్లలో కాలి ప్లాస్టిక్ డబ్బాలు వేరుకోవడానికి వచ్చిన ఒక సంచార కుటుంబానికి చెందిన రేణుక(10) అనే బాలికను కెవిపిఎస్ నాయకులు అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా నాయకులు అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం సంచార కుటుంబానికి చెందిన పది సంవత్సరాల రేణుక రెడ్డి గణపవరం గ్రామంలో 15 రోజుల నుంచి ఉంటున్న విషయం నా దృష్టికి వచ్చిందని, ఈ విషయాన్ని మీడియా దృష్టికి తీసుకురాగా మీడియా ద్వారా అధికారులకు చేరడంతో ఐసిడిస్ సిడిపిఒ తులసి, మహిళా పోలీస్, ఐసిడిఎస్ అధికారులు బాలిక వద్దకు చేరుకొని వివరాలు సేకరించారని తెలిపారు. బాలికను వివరాలు అడగగా తల్లి పేరు గీతా, తండ్రి కృష్ణ అని వీరికి ఎనిమిది మంది ఆడపిల్లలు పుట్టారాని, మళ్ళీ ఆమె తల్లి గర్భవతి, వాళ్లల్లో ఇద్దరు బాలికలను రెడ్డి గణపవరం తిరనాళ్ల సమయంలో తిరనాల్లో పూసలు అమ్ముకునే వాళ్లకు విక్రయించారని బాలిక చెబుతుంది. నన్నుకూడా అదేవిధంగా డబ్బులకు అమ్మేస్తారని నేను తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లనని ఏడ్చుకుంటూ మీడియా, అధికారులకు చెప్పింది. నాకు చదువు కోవాలని ఉందని బాలిక అంది. బాలిక చెప్పిన వివరాలను బట్టి చూస్తే బాలిక తప్పిపోయిందా లేక ఆమె తల్లిదండ్రులు ఆమెను స్థానికంగా ఉన్న కొంతమంది వ్యక్తులకు విక్రయించారా అనే అనుమానం వస్తుందన్నారు. ఈ బాలిక రెడ్డి గణపవరంలోని ఒక కుటుంబం వద్ద కొన్ని రోజులుగా పని చేస్తుందని, అక్కడ పనిచేయలేక రెడ్డిగణపవరం విఒ ఎ.సుజాత ఇంటికి చేరుకుందని, బాలికకు కనీసం కట్టుకోవడానికి బట్టలు లేకపోతే విఒ ఎ.సుజాత ఆమెకు బట్టలు ఇప్పించి, భోజనం పెట్టి చేరదీసిందన్నారు. ఇదిలా ఉండగా స్థానికంగా ఉన్న కొంతమంది ఆ అమ్మాయిని మా దగ్గర పనికి పెడితే డబ్బులు ఇస్తామని పోటీ పడడంతో విషయం బయటకు వచ్చిందని తెలిపారు. ఇలాంటి సంచార జాతులకు సంబంధించిన వారికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించి, శిశువుల విక్రయాలను అరికట్టాలని, ప్రస్తుతం బాలికలపై జరుగుతున్న ఆకృత్యాలను దృష్టిలో ఉంచుకొని ఆ బాలికకు సంరక్షణ, విద్య సౌకర్యాలను కల్పించి ప్రభుత్వం ఈ సంఘటనపై పూర్తి దర్యాప్తు చేయాలని అన్నారు. ఈ ఘటనపై స్పందించిన ఐసిడిఎస్ సిడిపిఒ తులసి, సూపర్‌వైజర్ వై.వెంకటలక్ష్మి, జిల్లా శిశుసంరక్షణ కార్యాలయం ఏలూరు కు బాలికను తరలించారు. బాలికకు చదువు, అన్ని సౌకర్యాలను ప్రభుత్వం ద్వారా కల్పిస్తామని ఐసిడిఎస్ సిడిపిఒ తులసి తెలిపారు.


ఐసిడిఎస్, శిశుసంరక్షణ అధికారులతో బాలిక

ముఖ్య వార్తలు

మంగళవారం 16 ఏప్రిల్ 2024

జిల్లాపరిషత్ సమావేశంలో అభివృద్ధి అంశాలపై చర్చ

పాల్గొన్న ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో సోమవారం జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశం వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ప్రణాళిక, ఆర్థిక స్థాయి కమిటీ, గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ, విద్య, వైద్య సేవలు, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమం, ఉపాధిహామీ పనులు, రోడ్లు, భవనాలు, పంచాయితీ రాజ్ పనులు, తాగునీరు, విద్యుత్, రబీ సీజన్‌లో ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు తదితర అభివృద్ధి అంశాలపై వివిధ శాఖల జిల్లా అధికారులు తమతమ ప్రగతి నివేదికలను సమావేశంలో వివరించి చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, డిప్యూటీ సిఇఒ నిర్మలా జ్యోతి, వివిధ శాఖల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా, అధికారులు పాల్గొన్నారు.

రేపు శ్రీరామ నవమి వేడుకలు

ప్రజాశక్తి - కైకలూరు

ఈనెల 17న శ్రీరామకృష్ణ సేవా సమితి మందిరంలో పెద్ద ఎత్తున కళ్యాణ వేడుకలు నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు భూపతిరాజు వెంకటేశ్వర వర్మ సోమవారం తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకి శ్రీరామకృష్ణ సేవా సమితిలో శ్రీరామ నవమి వేడుకలు సీతా రాముల వారి కళ్యాణమహోత్సవం జరుగుతుందన్నారు. భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు, అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు. సమితి సభ్యులు, భక్తులందరూ కుటుంబ సమేతంగా పాల్గొనాలన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ ప్రభాకరరావు

20లోగా ప్రవేశాల మ్యాపింగ్ పూర్తి చేయాలి

ఎంఇఒ ప్రభాకరరావు

ప్రజాశక్తి - కలిదిండి

ఈనెల 20వ తేదీలోగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు మ్యాపింగ్ ప్రక్రియ పూర్తిచేయాలని ఎంఇఒ పిడుగు ప్రభాకర బాబు అన్నారు. స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో మండలస్థాయి ప్రధానోపాధ్యాయుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానం ద్వారా ఈ ఏడాది నుంచి ప్రతి పాఠశాలలోని అత్యధిక తరగతి పూర్తి చేసిన విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డిక్లరేషన్ పొందాలన్నారు. అనంతరం ఆ విద్యార్థిని సదరు పాఠశాలకు మ్యాపింగ్ చేసే బాధ్యత ప్రధానోపాధ్యాయులు తీసుకోవాలన్నారు. గతంలో అత్యధిక తరగతి పూర్తి చేసిన విద్యార్థి పేరు డ్రాప్ అవుట్ బాక్స్‌లోకి వెళ్లడం వల్ల, ఆ విద్యార్థి ఏపాఠశాలలో ఉన్నాడో తెలుసుకోవడం కష్టతరమైందన్నారు. ప్రస్తుత విధానం వల్ల ఆ సమస్య ఉండదన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు త్వరితగతిన ప్రవేశాల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఎంఇఒ తెలిపారు.

మహిళలపై దాడులు అరికట్టాలి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రోజురోజుకూ మహిళలపై పెరుగుతున్న దాడులు, అత్యాచారాలను ప్రభుత్వాలు అరికట్టడం లేదని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లాకమిటీ ఆధ్వర్యంలో మోటూరు ఉదయం మహిళా న్యాయ సహాయ కేంద్రం ఆదివారం రాత్రి 7 గంటలకు స్థానిక రంగారావు వీధిలోని ఐద్వా భవనంలో పున్ణప్రారంభం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి అధ్యక్షత వహించారు. ఈ సభకు ముఖ్య వక్తలుగా హాజరైన రిటైర్డ్ జడ్జి ఎ.లక్ష్మి, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ పురుషులు మద్యంకు బానిసై మహిళలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కుటుంబాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మోటూరి ఉదయం న్యాయ సహాయ కేంద్రం పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మోటూరు ఉదయం న్యాయ సహాయకేంద్రం గౌరవాధ్యక్షులు రావి గోపాలకృష్ణయ్య మాట్లాడుతూ యువత ఈవ్ టీజింగ్ వల్ల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందన్నారు. అలాంటి వారికి ఈ న్యాయ సహాయకేంద్రం కౌన్సిలింగ్ వారి భవిష్యత్తు తోడ్పడాలని సూచించారు. అలాగే అడ్వకేట్స్ కట్టా సత్యనారాయణ, కూన కృష్ణారావు, ఒరుగంటి శైలజ మాట్లాడుతూ ఈరోజు యువత సామాజిక మాధ్య మాలతో మహిళలను, యువతను కించపరిచే విధంగా వారి ప్రవర్తన ఉంటుందని, అలాగే సామాజిక మాధ్యమాలను మంచికి ఉపయోగించకుండా ఇన్‌స్టాగ్రామ్‌లో మహిళలను అసభ్యకరంగా చిత్రిస్తూ వారిని మానసిక ఆందోళనకు గురి చేస్తున్నారని అన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలరాణి మాట్లాడుతూ దీన్ని చురుగ్గా పనిచేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. చివరలో కమిటీ ఏర్పాటు జరిగింది. ఈ కమిటీలో జిల్లా కార్యదర్శిగా ఎ.శ్యామల రాణి, బి.హైమావతి, జె.హరీష, దుర్గ, సిహెచ్.రాజ్యలక్ష్మి, జి.శారద, జి.సురేష్, లతలతో కూడిన కమిటీ ఏర్పాటు జరిగింది. ఈ సభలో యుటిఎఫ్ నాయకులు బి.సుభాషిని, శ్రావణి, ఐద్వా జిల్లా నాయకులు ఆర్.వెంకటరమణ, సింహాచలం పాల్గొన్నారు.

ప్రారంభం కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

ఉపాధి పనుల్లో అవకతవకలుంటే సహించేది లేదు

సిపిఎం ఏలూరు జిల్లా నాయకులు రాజు

ప్రజాశక్తి - ముసునూరు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా జరిగే పనులలో ఎటువంటి అవకతవకలు జరిగినా సహించేది లేదని సిపిఎం ఏలూరు జిల్లా నాయకులు జి.రాజు అన్నారు. సోమవారం ముసునూరు మండలంలోని కొర్లకుంట రెవెన్యూ గ్రామ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడగా ఏప్రిల్, మే నెలలో జరిగే ఉపాధి పనులలో ఎండ వేడిమి తట్టుకోలేక ఉన్నామని, మజ్జిగ, మంచినీళ్లు, టెంట్ ఏర్పాట్లు చేస్తామని చెప్పారు, కాని ఇంకా చేయటం లేదన్నారు. గతంలో రెండు, మూడు వారాలు బిల్లులు ఇంకా మా బ్యాంక్ అకౌంట్లో జమ కాలేదని, వడగాల్పులకు ఉండలేని పరిస్థితుల్లో ఉదయం 5 లేదా 6 గంటలకు వచ్చి పనిచేసిన నుంచి 12 గంటల వరకు పై స్థాయి అధికారులు ఉండమన్నారన్నారు. కింద స్థాయి ఉద్యోగులు ఉపాధి కూలీలతో ఆక్రోశం వెళ్లపుచ్చుతున్నారన్నారు. మండలంలోని 16 గ్రామాల్లోని ఉపాధి హామీ చట్టం ద్వారా జరుగుతున్న కూలీలకు ఇదే పరిస్థితి ఉందని వాపోయారు.

కూలీలతో మాట్లాడుతున్న రాజు

10,442 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

జెసి బి.లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లాలో ప్రస్తుత రబీ పంటకు సంబంధించి ఇంతవరకు 873 మంది రైతుల వద్ద నుంచి రూ.15.65కోట్ల విలువైన 10,442.520 మెట్రిక్ టన్నుల ధాన్యం ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసి, అనుసంధానం చేయబడిన రైస్ మిల్లులకు రాండమ్ సెలెక్షన్ ద్వారా తరలించడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించబడి ఇప్పటి వరకూ 2,751 మంది రైతులకు చెందిన 27,356 మెట్రిక్ టన్నుల ధాన్యమును విక్రయించుటకు నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. కనీస మద్దతు ధరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయుటకు ఏలూరు జిల్లాలో 120 ఆర్‌బికెలలో ధాన్యం కొనుగోలు కేంద్రముల 66 కొనుగోలు సహాయక కేంద్రాల ద్వారా తగు సిబ్బందితో, అవసరమగు అన్ని సౌకర్యములతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుటకు జిల్లా యంత్రాంగం వారు క్షేత్రస్థాయి పర్యవేక్షణ నిమిత్తం మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణ అధికారులు ఎప్పటికప్పుడు సంబంధిత మండలాలకు స్వయంగా వెళ్లి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా పూర్తి స్థాయిలో పనిచేయడం జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమయంలో వచ్చు రైతుల ఫిర్యాదులను స్వీకరించుటకు, పరిష్కరించుటకు జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ నెంబర్లు 08812-230448, 7702003584, 7569562076, 7569597910 ఏర్పాటు చేశామన్నారు. కావున రైతులందరూ తమ ధాన్యం కోతలు అయిన తరువాత ఆరబెట్టుకొని సుమారుగా తేమ శాతం 16 నుంచి 17 వరకు ఉండు విధంగా చూసుకొని, ధాన్యములో తాలు, తప్పలు మొదలైన వ్యర్థ పదార్థాలు లేకుండా ప్రభుత్వము నిర్దేశించిన అన్ని నాణ్యతా ప్రమాణములకు అనుగుణముగా సిద్ధం చేసుకోవాలన్నారు. కనీస మద్దతు ధరకు అనగా క్వింటాలుకు కామన్ రకం రూ.2183, గ్రేడ్-ఎ రకంకు రూ.2203 బయోమెట్రిక్ విధానంలో తమ వేలిముద్రను వేసి ప్రభుత్వము వారికి విక్రయించుకోవచ్చునని తెలిపారు.

ఎంఎల్‌సికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎంఎల్‌సి జయ మంగళ వెంకటరమణకు ముదినేపల్లి మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ అల్లా బక్ష్ సోమవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కైకలూరులోని జయమంగళ వెంకటరమణ స్వగృహంలో ఎంఎల్‌సికి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వారు చేసిన సేవలను ఈ సందర్భంగా కొని యాడారు. అల్లాబక్ష్ వెంట వెంకన్న ఉన్నారు.

శుభాకాంక్షలు తెలియజేస్తున్న అల్లాబక్ష్

నేరాలు - ఘోరాలు

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రమాదవశాత్తు ట్రైన్ నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం ఉదయం 9 గంటలకు తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. దీనిపై రైల్వే ఎస్ఐ జి.శ్రీహరి బాబు తెలిపిన వివరాల ప్రకారం కొత్తంగి మహేష్ కుమార్(33) తండ్రి శ్రీనివాసరావు ధవళేశ్వరం గ్రామం, రాజమండ్రి జిల్లాకు చెందిన వ్యక్తి ధవళేశ్వరం నుంచి విజయవాడ వెళుతుండగా తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్‌లో మంచినీళ్ల కోసమని దిగి బాటిల్ తీసుకుని తిరిగి ట్రైన్ ఎక్కే సమయంలో.. ట్రైన్ కదిలిపోవడంతో కంగారులో రైలుకి ప్లాట్‌ఫారంకి మధ్య పడి నలిగి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ శ్రీహరి బాబు తెలిపారు. కేసును దర్యాప్తు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం మృతిని బంధువులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న సొంగ రోషన్ కుమార్

వైసిపిని గద్దె దింపాలి

సొంగా రోషన్ కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

లింగపాలెం మండలం కొత్తపల్లి గ్రామంలో టిడిపిలోకి పలువురు చేరారు. వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపడం ఖాయమని టిడిపి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి సొంగ రోషన్ కుమార్ అన్నారు. లింగపాలెం మండలం కొత్తపల్లి గ్రామంలో సొంగ రోషన్ కుమార్ ఆధ్వర్యంలో యాదవ సోదరులు 50 మంది టిడిపి తీర్థం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపిలోకి వచ్చిన యాదవ సోదరులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విజయరాజు

కార్యకర్తలకు అండగా ఉంటాం..

వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి విజయరాజు

ప్రజాశక్తి - చింతలపూడి

వైసిపి కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని వైసిపి చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. లింగపాలెం మండలం అయ్యపరాజుగూడెంలో కంభం విజయరాజు చనిపోయిన వైసిపి కార్యకర్తల కుటుంబాలకు, తాడిపర్తి రంగయ్య, బత్తుల యేసు, బొర్రా రాజేష్ కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. తక్షణమే వారికి ప్రభుత్వ నుంచి సహాయం అందేలా చూస్తామని విజయరాజు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొరారి మోహన్, మండల సచివాలయాల కన్వీనర్ శాంతారామ్, పలువురు సీనియర్ వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇండియా వేదికతోనే అభివృద్ధి సాధ్యం

కాంగ్రెస్ కైకలూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి నోబుల్


ప్రచారంలో నోబుల్

ప్రజాశక్తి - కైకలూరు

ఇండియా వేదికతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ ఎంఎల్‌ఎ అభ్యర్థి బొడ్డు నోబుల్ అన్నారు. మండలంలోని భుజబలపట్నంలో ఆయన సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వల్లూరి రాజారావు, గుజ్జుల నల్లా, చింతల వెంకటరత్నం, వల్లూరి రామచంద్రరావు, దాసరి శ్యాంబాబు, సదర్ల ఫిలిప్, కురేళ్ల జాన్ విక్టర్, చింతల బాలస్వామి, టి.ప్రభ, గరికిముక్కుల ఏసు, మానికొండ చిన్ని, గుజ్జుల రామయ్య, జంగం డేవిడ్, గ్రామ పెద్దలు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.


క్రీడాకారులతో మాట్లాడుతున్న కానూరి బుజ్జి

నరసాపురం :కాంగ్రెస్ అధికారంలోకొస్తే నిరుద్యోగ సమస్య తీరుతుందని ఆ పార్టీ నరసాపురం ఎంఎల్‌ఎ అభ్యర్థి కానూరి ఉదయ భాస్కరకృష్ణప్రసాద్(బుజ్జి) అన్నారు. పట్టణంలో పోలిశెట్టి సీతారామయ్య టెన్నిస్ కాంప్లెక్స్‌లో క్రీడాకారులను, మెయిన్ రోడ్డులో వ్యాపారులను సోమవారం ఆయన కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తే వృద్ధులు, వితంతువులకు పెన్షన్ రూ.నాలుగు వేలు, వికలాంగులకు రూ.ఆరు వేలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మల్లిపూడి శ్రీనివాస్, గుబ్బల కృష్ణారావు, సోడదాసి శ్రీధర్, సాల్మన్, సాధనాల చిన్న పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ముద్దరబోయిన పర్యటన


ప్రచారంలో ముద్దరబోయిన వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ముసునూరు

తెలుగుదేశం పార్టీలో పెద్దాయన ప్రభావం తగ్గిపోయిందని, అందుకే ఇతర పార్టీల నుంచి దిగుమతి చేసుకున్న వాళ్ల ప్రభావం పెరుగుతోందని నూజివీడు స్వతంత్ర ఎంఎల్‌ఎ అభ్యర్థి, మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడు మండలం బత్తులవారిగూడెం, యనమందల, సుంకొల్లు గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో టిడిపి ఓటమి చెందిన తరువాత ఆ ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన వారు సైతం కనీసం పార్టీ జెండా పట్టిన దాఖలాలు లేవన్నారు. అలాంటి పరిస్థితుల్లో కూడా నూజివీడు నియోజకవర్గంలో జెండా పట్టి స్థానిక ఎన్నికల్లో సైతం అభ్యర్థులను నిలబెట్టి వారి గెలుపునకు అహర్నిశలు కష్టపడి పార్టీని రాష్ట్రంలో ముందు వరుసలో నిలిపానన్నారు. దానిని గుర్తించిన చంద్రబాబు నూజివీడులో పర్యటించిన రెండు సందర్భాల్లో కాబోయే ఎంఎల్‌ఎ ముద్దరబోయిన అంటూ పేర్కొన్నారని, ఎన్నికల సమయం వచ్చేసరికి ఆ మాట మారిపోయిందన్నారు. 2014 నుంచి 2019 వరకు నియోజకవర్గ అభివృద్ధికి అనేక నిధులను మంజూరు చేయించి అభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలిపానన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిచిన తర్వాత అధికారంలో ఏ పార్టీ ఉన్న నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

మూడోసారి గెలిపించండి

ఉండి స్వతంత్ర ఎంఎల్‌ఎ అభ్యర్థి శివరామరాజు


ఎన్నికల ప్రచారంలో శివరామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

మూడోసారి తనని ఆశీర్వదించి గెలిపించాలని ఉండి స్వతంత్ర ఎంఎల్‌ఎ అభ్యర్థి, మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకటశివరామరాజు ప్రజలను కోరారు. మండలంలోని ప్రాతళ్లమెరక, పల్లెపాలెం, దొడ్డనపూడి గ్రామాల్లో ఆయన సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రాతళ్లమెరక గ్రామంలో వేగేశ్న బాలగణపతివర్మ ఆధ్వర్యంలో శివరామరాజుకు గజమాలతో సత్కరించారు. ప్రతి వీధికి ఆటోలో తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామరాజు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే తన అజెండాగా ముందుకు వస్తున్నానన్నారు. ఎంఎల్‌ఎగా ఉన్న పది సంవత్సరాల్లో ప్రజల మనసుల్లో నిరంతరం మమేకమై నియోజకవర్గ అభివృద్ధికి కషి చేశానన్నారు. గడచిన ఐదేళ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమన్నారు. తనను ఎంఎల్‌ఎగా గెలిపిస్తే ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతానన్నారు. ఈ ప్రచారంలో కలవపూడి సర్పంచి గేదలజాన్, వేగేశ్న బాలగణపతివర్మ, అల్లూరి అచ్యుతరామరాజు, మంతెన సత్యనారాయణరాజు, మంతెన శ్రీవెంకటరాజు, ముదుండి దుర్గరాజు, తిరుమాని మాత్రాజు, బస్వాని వడ్డికాసులు, బర్రె కనకరాజు, తిరుమాని పాండు, తిరుమలశెట్టిబాలాజీ, యిర్రింకి శివన్నారాయణ, కందులపాటి వీరరాఘవులు, కొల్లి మురళీకృష్ణ, మంతెన శ్రీవెంకటరాజు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో అందరూ భాగంకావాలి

ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి పితాని సత్యనారాయణ


మాట్లాడుతున్న పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగం కావాలని టిడిపి ఆచంట ఎంఎల్‌ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ కోరారు. మార్టేరులో టిడిపి ఎన్నికల కార్యాలయాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. బిజెపి పార్లమెంట్ అభ్యర్థిని కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు తమనంపూడి దుర్గాశ్రీరామ్‌రెడ్డి, కోనాల శ్రీనివాసరెడ్డి, తేతల రాజారెడ్డి, కారేపల్లి భాస్కరరావు, దొంగ సత్యనారాయణ, అచ్యుతరావు, పాలా ప్రసాద్, షేక్ అలీ, కనకా రెడ్డి, కెహెచ్‌వి.ప్రసాద్ రెడ్డి, వెలగల మల్లికార్జున్‌రెడ్డి, కడలి ఏడుకొండలు పాల్గొన్నారు.

అన్నింటా తలదన్నేలా.. తణుకు

ఓవైపు గోస్తనీ పరవళ్లు.. మరోవైపు పరిశ్రమల సైరన్ మోతలు.. నడుమ మహాభారతాన్ని ఆధునికీకరించిన ఆదికవి నన్నయ్య అడుగుజాడలు.. ఇవీ తణుకు ముఖచిత్రానికి ప్రతిరూపాలు. ఆర్థికంగా, వాణిజ్యపరంగా, పారిశ్రామికంగా, విద్య, వైద్య రంగాల్లో తణుకు పట్టణం ఎంతో అభివృద్ధి చెందింది.

తణుకు నియోజకవర్గం 1952లో ఏర్పడింది. తణుకు పట్టణంతోపాటు ఉండ్రాజవరం, పెరవలి మండలాలు, పెంటపాడు మండలంలో కొన్ని గ్రామాలు ఈ నియోజకవర్గంలో ఉండేవి. 2009 ఎన్నికలకు ముందు చేపట్టిన నియోజకవర్గాల పునర్విభజనలో దీని స్వరూపం పూర్తిగా మారింది. అత్తిలి నియోజకవర్గం రద్దు కావడంతో అత్తిలి మండలాన్ని, రద్దయిన పెనుగొండ నియోజకవర్గంలోని ఇరగవరం మండలాన్ని తణుకు నియోజకవర్గంలో కలిపారు. ఉండ్రాజవరం, పెరవలి మండలాలను తణుకు నుంచి వేరుచేసి నిడదవోలు నియోజకవర్గంలో కలిపారు. దీంతో తణుకు పట్టణం, మండలం, ఇరగవరం, అత్తిలి మండలాలతో తణుకు నియోజకవర్గం సరికొత్తగా రూపుదిద్దుకుంది.

స్వాతంత్రోద్యమ కాలం నుంచి తణుకు రాజకీయ కార్యకలాపాలకు, పోరాటాలకు కేంద్రంగా ఉంది. ఇక్కడి నేతలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో చక్రం తిప్పారు. ప్రధానంగా రెండు కుటుంబాల మధ్యే రాజకీయ పోరు అన్నట్లుగా చాలాకాలం సాగింది. టిడిపి తరపున బోళ్ల బులిరామయ్య కేంద్రమంత్రిగా పని చేశారు. పారిశ్రామికంగా ఉన్నంతలో తణుకు పురోగతి సాధించింది. ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ 1947లో ఆంధ్రా సుగర్స్ స్థాపించడంతో పారిశ్రామికీకరణకు బాటలు పడ్డాయి. రాష్ట్ర, జాతీయస్థాయిలోనే ఆంధ్రాసుగర్స్ పేరొందింది. రాకెట్ ఇంధనం తయారీతో అంతర్జాతీయస్థాయిలో ఖ్యాతి గడించింది. వెంట్రులక పరిశ్రమతోపాటు నూలు పరిశ్రమలు, పౌల్ట్రీ పరిశ్రమ విస్తరించాయి. గోదావరి జోన్ పరిధిలో ఐదు జిల్లాలకు సంబంధించి నెక్ ప్రధాన కార్యాలయం తణుకులోనే ఉంది. ప్రతిరోజూ గుడ్డు ధరను ఇక్కడే నిర్ణయిస్తుంటారు.

కాలగమనంలో రాజకీయాల్లో కుటుంబ వ్యవస్థ ప్రభావం ఒకింత తగ్గింది. దీనికితోడు ఆంధ్రా సుగర్స్ మూతపడటంతో కార్మికులకు ఉపాధి కరువైంది. ఈ నియోజకవర్గంలోని ఇరగవరం మండలంలో ఇప్పటికీ సరైన రవాణా వ్యవస్థ, బస్సు సౌకర్యం లేకపోవడం గమనార్హం.



నాటి నుంచి నేటి వరకూ..

సంవత్సరం	విజేత	పార్టీ
1952	చిట్టూరి ఇంద్రయ్య	కెఎంపి
1955	ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్	కాంగ్రెస్
1962	ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్	కాంగ్రెస్
1967	గన్నమని సత్యనారాయణమూర్తి	స్వతంత్ర
1972	గన్నమని సత్యనారాయణమూర్తి	కాంగ్రెస్
1978	కంటిపూడి అప్పారావు	స్వతంత్ర
1983	చిట్టూరి వెంకటేశ్వరరావు	టిడిపి
1985	ముళ్లపూడి వెంకటకృష్ణారావు	టిడిపి
1989	ముళ్లపూడి వెంకట కృష్ణారావు	టిడిపి
1994	ముళ్లపూడి వెంకటకృష్ణారావు	టిడిపి
1999	వైటి.రాజా	టిడిపి
2004	చిట్టూరి బాపినీడు	కాంగ్రెస్
2009	కారుమూరి వెంకటనాగేశ్వరరావు	కాంగ్రెస్
2014	ఆరిమిల్లి రాధాకృష్ణ	టిడిపి
2019	కారుమూరి వెంకటనాగేశ్వరరావు	వైసిపి

18 నుంచి 25 వరకూ నామినేషన్ల స్వీకరణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి స్వామినాయుడు

ప్రజాశక్తి - ఆచంట

ఏప్రిల్ 18 నుంచి 25వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణకు దరఖాస్తులు దాఖలాలు చేసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్వామి నాయుడు తెలిపారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల దాఖలు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నామినేషన్ ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. నామినేషన్ రోజున అభ్యర్థులతో పాటు నలుగురికి మాత్రమే లోపలికి అనుమతి ఉంటుందన్నారు. ఏప్రిల్ 18వ తేదీ నుంచి 25 తేదీ వరకు సెలవు రోజుల్లో తప్ప ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ నామినేషన్ల స్వీకరణ జరుగుతుందన్నారు. ఒక్కో అభ్యర్థి నాలుగు నామినేషన్ వరకూ దాఖలు వేసుకోవచ్చన్నారు. అభ్యర్థి రెక్కనైజింగ్ పార్టీ అయితే ప్రతిపాదన చేసిన వ్యక్తి ఒకరు మాత్రమే ఉండాలన్నారు. రీజనల్, ఇండిపెండెంట్ అభ్యర్థులైతే నియోజకవర్గంలో ఓటు హక్కు ఉన్న పదిమంది ప్రతిపాదన చేసిన వ్యక్తులకు అవకాశం ఉంటుందన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థి సెక్యూరిటీ, డిపాజిట్ కింద రూ.10,000 చేయాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులైతే రూ.5 వేలు డిపాజిట్ చేయాలన్నారు. అభ్యర్థులు నామినేషన్ వేసిన రోజు నుంచి ఖర్చు మొత్తం అభ్యర్థి ఖాతాకు జమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కెహెచ్‌వి.ప్రసాద్, గణపతినీడి రాంబాబు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, ఎంపిడిఒలు నరసింహ ప్రసాద్ పద్మజ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పివిఎల్ రోడ్ షో


రోడ్డు షోలో పివిఎల్

ప్రజాశక్తి - కాళ్ల

ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసిపి ఉండి ఎంఎల్‌ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు ఆధ్వర్యంలో సోమవారం రోడ్డు షో నిర్వహించారు. మండలంలోని పెదఅమిరం గ్రామంలో ఉన్న వైసిపి క్యాంపు కార్యాలయం నుంచి రోడ్డుషో ప్రారంభమైంది. పెదఅమిరం, వేంపాడు, కోపల్లె, బొండాడ, ఎల్ఎన్.పురం, మాలవానితిప్ప, మోడి, కలవపూడి, పల్లిపాలెం, ప్రాతళ్లమెరక, ఏలూరుపాడు, జువ్వలపాలెం, కాళ్లకూరు, దొడ్డనపూడి, కాళ్ల, సీసలి, జక్కరం గ్రామాల్లో రోడ్డు షో నిర్వహించారు. ఈ రోడ్డు షోలో నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఆంధ్రప్రదేశ్ క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు (వాసు), టిటిడి బోర్డు మాజీ సభ్యులు గోకరాజు రామరాజు, వైసిపి నాయకులు గాదిరాజు సుబ్బరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రుస్తుంబాదలో ముదునూరి కుమారుని ప్రచారం

నరసాపురం :ఒక్క రూపాయి అవినీతి లేకుండా సుమారు నాలుగు వేల మందికి రూ.47 వేల కోట్లు ఖర్చు చేసి ఇళ్ల స్థలాలు ఇచ్చామని వైసిపి నరసాపురం ఎంఎల్‌ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు కుమారుడు శ్రీకృష్ణంరాజు అన్నారు. మండలంలోని రుస్తుంబాద గ్రామంలో సోమవారం ప్రజ ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో శ్రీకృష్ణంరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా కుయుక్తులు పన్నినా ప్రజలందరి ఆశీర్వాదంతో మంచి చేస్తూ, ప్రజా శ్రేయస్సు కోసమే తన తండ్రి పని చేస్తున్నారన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. నరసాపురం పట్టణంలో 31వ వార్డులో ప్రజ ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో ప్రసాద్‌రాజు సతీమణి శారదావాణి పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ అభివృద్ధికి పట్టం కట్టాలని కోరారు.

వైసిపి హయాంలోనే తీర ప్రాంత గ్రామాలాభివృద్ధి

ముదునూరి ప్రసాదరాజు

మొగల్తూరు :తీర ప్రాంత గ్రామాలు వైసిపి హయాంలోనే అభివృద్ధి అయ్యాయని ఆ పార్టీ నరసాపురం ఎంఎల్‌ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని పేరుపాలెం సౌత్ గ్రామంలో ప్రజ ఆశీర్వాద కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వైసిపి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వైసిపితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ప్రచారంలో సర్పంచి తిరుమణి విజయలక్ష్మి నరసింహరావు, జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాపూజీ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, పత్తి రాంబాబు, పోతుల రమేష్ పాల్గొన్నారు.

వార్డు కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్ల ప్రచారం

జంగారెడ్డిగూడెం టౌన్ :పట్టణంలోని 20, 21 వార్డుల్లో కౌన్సిలర్లు కంచర్ల గీత, కటారి వాసు, సచివాలయ కన్వీనర్లు చిత్తపురి శేఖర్, కర్పూరం గుప్తా ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వైసిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కు, చింతలపూడి ఎంఎల్‌ఎ అభ్యర్థి కంభం విజయరాజుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, పోలవరం పరిశీలకులు జెట్టి గురునాధరావు, ఏలూరు జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పొల్నాటి బాబ్జి, రాష్ట్ర మహిళా సెక్రటరీ కాసర తులసిరెడ్డి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి మహేష్‌యాదవ్

మాట్లాడుతున్న మహేష్‌యాదవ్

ప్రజాశక్తి - చింతలపూడి

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, రైతులకు న్యాయం చేస్తానని టిడిపి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్ అన్నారు. మండలంలోని ఊటసముద్రంలో పామాయల్ రైతులను ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, చింతలపూడి ఎంఎల్‌ఎ అభ్యర్థి రోషన్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా మహేష్‌యాదవ్ మాట్లాడుతూ తాను రైతు కుటుంబం నుంచి వచ్చానన్నారు. రైతులు బాగుంటేనే అందరూ బాగుంటారన్నారు. రైతులను సమస్యలు తెలుసుకుంటున్నానని చెప్పారు. పామాయల్ పంటకు ఫిక్స్‌డ్ రేటు పెడతానని చెప్పారు. మొదటి ప్రాధాన్యత రైతులకు, యువతకు ఇస్తానన్నారు. యువత వ్యవసాయం వైపు రావాలని, వారికి అండగా ఉంటానని, పరిశ్రమలు పెట్టడానికి ప్రోత్సహిస్తానని చెప్పారు. రోషన్‌కుమార్ మాట్లాడుతూ పామాయల్ రైతులు పడించిన పంటకు ఫిక్స్‌డ్ రేటు వచ్చేవిధంగా కృషి చేస్తామన్నారు. రైతుల సమస్యలు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, రైతు జిల్లా అధ్యక్షులు గుత్త వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ మండలాధ్యక్షులు చిదారల మధుబాబు, పామాయిల్ రైతులు, రాజు, అంకం రాజు పాల్గొన్నారు.

కుయుక్తులకు పాల్పడుతున్న వైసిపి

మాజీ మంత్రి పితాని సత్యనారాయణ

ఆచంట : ఎపిలో సార్వత్రిక ఎన్నికల సమీపిస్తుండగా అధికార పార్టీ వైసిపి కుయుక్తులకు పాల్పడుతుందని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ అన్నారు. మండలంలోని కొడమంచిలి గ్రామంలో సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పాదయాత్ర చేపట్టి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం జ్ఞానం లేని ముఖ్యమంత్రి జగన్, ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు ప్రజా ప్రతినిధులుగా ప్రజాస్వామ్యానికి పనికిరారని ఎద్దేవా చేశారు. పేదవాడికి ఇచ్చిన పట్టా భూమికి దారి లేదని, ఇల్లు నిర్మించుకునేందుకు ముడి సరుకులు తరలించడానికి లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందన్నారు. ప్రజల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా పార్టీలకు అతీతంగా ఇవ్వాల్సిన సంక్షేమ పథకాలను తమ పార్టీ వారికే అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, పార్టీ మండలాధ్యక్షులు కేతా మీరయ్య, నేతలు బీర నరసింహమూర్తి, చిలుకూరి శ్రీను, వెంకటరమణ, కేత మురళి, చిలుకూరి అబ్బారావు, వీరస్వామి, సత్యనారాయణ, కుమార్, బాలాజీ, వెంకటేశ్వరరావు, ప్రసాద్, నాగార్జున పాల్గొన్నారు.

19న నామినేషన్

పెనుమంట్ర :టిడిపి ఆచంట ఎంఎల్‌ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ ఈ నెల 19వ తేదీ శుక్రవారం నామినేషన్ దాఖలు చేస్తున్నారని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోడూరు మండలంలోని కొమ్ముచిక్కాలలోని స్వగృహం నుంచి పితాని సత్యనారాయణ ఉదయం 7.30 గంటలకు బయలుదేరి కవిటం, మార్టేరు సెంటర్ మీదుగా ఆచంట 9.30 గంటలకు చేరుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచంట నియోజకవర్గ పరిధిలోని ఆచంట, పెనుమంట్ర, పెనుగొండ, పోడూరు మండలాలకు చెందిన అన్ని గ్రామాల్లోని టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

గుమ్ములూరులో పర్యటిస్తున్న మంతెన రామరాజు

'టిడిపితోనే అభివృద్ధి'

పెనుమంట్ర :రాష్టంలో మళ్లీ టిడిపి ప్రభుత్వం పాలన వచ్చినప్పుడే సమగ్ర అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ ఆచంట ఎంఎల్‌ఎ అభ్యర్థి పితాని సత్యనారాయణ అన్నారు. మండలంలోని మార్టేరు గ్రామంలో ఆయన సోమవారం ఎన్నికల ప్రచార పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ కృషి చేస్తానని చెప్పారు. రానున్న ఎన్నికలో తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్ములూరులో మంతెర రామరాజు పర్యటన

ఆకివీడు : ఉండి సిట్టింగ్ ఎంఎల్‌ఎ మంతెన రామరాజు తిరిగి ప్రచారం ప్రారంభించారు. గత పది రోజులుగా పార్టీ అభ్యర్థి ఎవరనే గందరగోళంలో రకరకాల పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఈ పరిస్థితుల మధ్య ఆగిపోయిన ప్రచారం అభ్యర్థి ఎవరనేది తేలకుండానే సోమవారం సాయంత్రం తిరిగి ఆయన ప్రారంభించారు. మండలంలోని గుమ్ములూరులో ఎంఎల్‌ఎ మంతెన రామరాజు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

బొమ్మిడి నాయకర్ సతీమణి ప్రచారం

నరసాపురం :పట్టణంలోని మూడో వార్డులో మనకోసం మన నాయకర్ కార్యక్రమంలో భాగంగా జనసేన నరసాపురం ఎంఎల్‌ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ సతీమణి సునీత, కుమార్తె శ్రీయ, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బొమ్మిడి నాయకర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి వెంకటేశ్వరరావు, కృష్ణ, పోలిశెట్టి సాంబ, నళిని, సంకు భాస్కర్, జక్కం శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

సిఎం జగన్ బస్సు యాత్ర నేపథ్యంలో ట్రైల్ రన్

ప్రజాశక్తి - ఉండి

సిఎం బస్సు యాత్ర నేపథ్యంలో ఉండి కోట్ల ఫంక్షన్ హాలు వద్ద సోమవారం డిఎస్‌పి నారాయణస్వామి రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు బస్సు ట్రైల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డి, ఇంటెలిజెన్స్ డిఎస్‌పి వెంకటేశ్వరరావు వారి బృందాలతో కోట్ల ఫంక్షన్ హాలు వద్ద సిఎం పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకునేందుకు డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. కోట్ల ఫంక్షన్ హాలు ఎదురుగా ఉన్న ఉండి మాజీ సర్పంచి చిక్కాల సత్య జగదీష్ ప్రసాద్ స్థలంలో సిఎం జగన్ బస్సును నిలుపుదల చేసి అక్కడే ఆయన భోజన వసతి ఏర్పాట్లను పూర్తి చేసేందుకు ఆ ప్రాంతంలో కూడా తనిఖీలను చేశారు. సిఎం పర్యటన నేపథ్యంలో ఎవరైనా అనుమానంగా తిరిగినట్లయితే వారిని వెంటనే అదుపులోకి తీసుకుంటామని, పర్యటనలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సజావుగా సాగేందుకు వైసిపి నాయకులు, కార్యకర్తలు అధికారులకు సహకరించాలని వారు కోరారు. ఈ ట్రైల్ రన్‌కు క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, ఉండి ఎంపిపి శ్రీహరి నారాయణరాజు, నాయకులు గులిపల్లి అచ్చారావు, సూరవరపు వెంకటాచార్యులు, గలవిల్లి ధనుంజయ, గొట్టుముక్కల కళ్యాణ వర్మ, అంగర రాంబాబు, రాయి సతీష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు

పెనుమల్లిలో అగ్నిప్రమాదంపై కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ముదునేపల్లి మండలం పెనుమల్లిలో గ్యాస్ పైపులైన్‌కు సమీపంలోని చెత్తకు నిప్పంటుకోవడంతో జరిగిన అగ్ని ప్రమాదంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టమూ జరగలేదని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ స్పష్టం చేశారు. సంఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే పోలీసు, రెవెన్యు సిబ్బంది అప్రమత్తమై గ్యాస్ కనెక్షన్ సరఫరాను నిలిపివేసినట్లు తెలిపారు. సంఘటనా స్థలంలో సంబంధిత మెయిల్ గ్యాస్ కంపెనీ అధికారులు మరమ్మతులు చేస్తున్నారని పేర్కొన్నారు. సంబంధిత పనులను మండవల్లి మండల తహశీల్దార్ పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

వేసవిలో అప్రమత్తత అవసరం

పిహెచ్‌సి వైద్యాధికారి అనిల్‌కుమార్

ప్రజాశక్తి - పెనుమంట్ర

వేసవిలో చిన్నా, పెద్దా అందరూ అప్రమత్తంగా ఉండడం ఆరోగ్యానికి అత్యంత అవసరమని ఆలమూరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన జాగ్రత్తల గురించి వివరించారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రత వేడిగాలుల వల్ల వడదెబ్బ, డీ హైడ్రేషన్ సాధారణమని, వీటికి తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రాణాంతకమని చెప్పారు. ప్రతిఒక్కరూ కోసం ఎండ, వడదెబ్బ నుంచి తమని తాము రక్షించుకోవడం కోసం చేయకూడని వాటి గురించి, చేయాల్సిన వాటి గురించి, ప్రథమ చికిత్స గురించి తెలుసుకోవాలని అన్నారు. మండు వేసవిలో ఎక్కువ ఉష్ణం ఉన్న సమయంలో తిరగడం మంచిది కాదని, మద్యం, గుట్కా తీసుకోవడం, రోడ్డు పక్కన చల్లని పానీయాలు తాగడం, కలుషితం, నిల్వ ఉన్న ఆహారం తినడం, మాంసాహారం ఎక్కువగా తినడం మంచిది కాదని తెలిపారు. రోజుకు కనీసం 15 గ్లాసుల మంచి నీళ్ల తాగాలని, పండ్ల రసాలు, ఆకు కూరలు, కాయగూరలతో భోజనం మంచిదని, లేతరంగులు గల వదులైన దుస్తులు ధరించాలని సూచించారు. ఒకవేళ వడదెబ్బ తగిలితే ఆ వ్యక్తిని వెంటనే నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలని, చల్లని తడిగుడ్డతో శరీరాన్ని తుడవాలని, గాలి తగిలేలా చూడాలని, ఆ వ్యక్తికి ఉప్పు కలిపిన పల్చటి మజ్జిగ గాని, చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ నీళ్ల గాని తాగించాలని తెలిపారు. వడదెబ్బ వల్ల అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీళ్ల తాగించకుండా, వెంటనే సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలని చెప్పారు.

ఘనంగా అగ్నిమాపక వారోత్సవాలు

తాడేపల్లిగూడెం :అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం స్థానిక అగ్నిమాపక శాఖాధికారి జి.రామారావు ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్, బస్టాండ్లలో ప్రయాణికులకు కరపత్రాలను పంచారు. అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ తగు జాగ్రత్త చర్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి గణేశ్ వెంకట రామారావు డిపోలో అగ్ని ప్రమాదాలపై డెమో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి సిబ్బందితో పాటు ప్రయాణికులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ట నిఘా

ఎస్ఇబి సిఐ పట్టాభిచౌదరి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల గుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై.పట్టాభిచౌదరి తెలిపారు. మండలంలోని తాటియాకులగూడెం ఆంధ్ర తెలంగాణ రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద రెండు రాష్ట్రాల ఎస్ఇబి అధికారులతో అంతర్రాష్ట్ర కో ఆర్డినేషన్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఇబి సిఐ పట్టాభిచౌదరి

సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా రెండు రాష్ట్రాల సరిహద్దుల గుండా పరస్పరం కోఆపరేటివ్‌గా ఉంటూ నాటుసారా, అక్రమ మద్యం, నగదు వంటివి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అదేవిధంగా సిబ్బంది 24 గంటల పాటు విధుల్లో ఉంటూ సరిహద్దు గ్రామాల్లో తనిఖీలు తీవ్రతరం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎస్ఇబి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కారాంచంద్, సిఐలు కె.సాంబమూర్తి, రేహమున్నీసా, చింతలపూడి సిఐ డిఎస్‌ఎవి.ప్రసాద్, ఎఎంవిఐ సురేష్, ఇఐపిఆర్‌డి నిఖిల్, మధుశరణ్, జంగారెడ్డిగూడెం సర్కిల్ ఎస్ఇబి ఎస్ఐలు ఎలైజర్, రాజేష్, చెక్‌పోస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కు అందరి బాధ్యత

ఆచంట : సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు అన్నారు. ఓటు హక్కు అందరి బాధ్యత అనే నినాదంతో సోమవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి కచేరి సెంటర్ వరకు వివిధ శాఖల అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామినాయుడు మాట్లాడుతూ దేశ, రాష్ట్ర భవిష్యత్తుకు ఓటే పునాది అన్నారు. నవ సమాజానికి యువతే కీలకమన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో దిశా దశ నిర్ణయించే స్థాయికి యువత ఎదగాలన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజాభివృద్ధే ధ్యేయంగా పని చేసే వారికి ప్రాధాన్యత ఇవ్వాలనే ఆలోచన నేటి యువతలో కనిపిస్తుందన్నారు. డబ్బు మద్యం ఇతర ప్రలోభాలకు లొంగి తమ ఓటు హక్కును దుర్వినియోగం చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహప్రసాద్, తహశీల్దార్ ఐపి శెట్టి, పంచాయతీ కార్యదర్శి జివి.నరసింహారావు, పోలీస్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పట్టణంలోని 18వ వార్డు తాళ్ల ముదునూరుపాడులో సుమారు వంద మందికి పైగా యువకులు, పెద్దలు సోమవారం సాయంత్రం 18వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి, మాజీ కౌన్సిలర్ మేడపాటి జనార్దనరెడ్డి ఆధ్వర్యంలో, మంత్రి కొట్టు సమక్షంలో పార్టీలో చేరారు.

వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు మండలంలోని కివ్వాక, మారెడుబాక, గణపవరం పంచాయతీలకు చెందిన సుమారు 20 మంది వాలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు.

ఏడు దుకాణాలపై కేసు

ప్రజాశక్తి - మొగల్తూరు

అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణాలపై తూనికలు కొలతలు అధికారులు సోమవారం తనిఖీలు చేశారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో శీతల పానీయాలు ఇతర దుకాణాలపై తూనికలు కొలతలు భీమవరం ఇన్‌స్పెక్టర్ టి.రాంబాబు ఆధ్వర్యంలో సిబ్బంది దాడు చేశారు. ఈ దాడుల్లో అధిక ధరలకు విక్రయిస్తున్న ఏడు దుకాణాలపై కేసులు నమోదు చేశామని రాంబాబు తెలిపారు.

టిడిపిని గెలిపించాలి : మాజీ మంత్రి పితాని

ప్రజాశక్తి - పెనుమంట్ర

రానున్న ఎన్నికల్లో టిడిపి గెలిపించాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ కోరారు. మార్టేరు శ్రీ వేణుగోపాలస్వామి ఆడిటోరియంలో మార్టేరులోని ఆటో యూనియన్ సభ్యులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. మహిళలకు ఉచిత ఆర్‌టిసి బస్సు ప్రయాణంలో ఆటో యూనియన్ సభ్యులందరూ ఇబ్బందులు ఎదుర్కొంటారని, దీనిపై పునరాలోచన చేయాలని కోరారు. దీనిపై పితాని స్పందించి మాట్లాడుతూ మూడు పార్టీల సమన్వయ కమిటీలో చర్చించి, ఆటో యూనియన్లకు నష్టం వాటిల్లకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి ఆటో డ్రైవర్లకు న్యాయం చేస్తామని అన్నారు.

'ప్రజాభిమానాన్ని చూసి ఓర్వలేకే దాడి'

ప్రజాశక్తి : పెనుమంట్ర

ప్రజా సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో యావత్ దేశంలోనే అగ్రగామిగా ఉన్న సిఎం జగన్ మోహన్ రెడ్డికి లభిస్తున్న ప్రజాభిమానాన్ని చూసి ఓర్వలేకే దాడులకు తెగబడ్డారని వైసిపి సీనియర్ నాయకురాలు, పెనుమంట్ర జెడ్‌పిటిసి సభ్యులు కర్రిగౌరి సుభాషిణి అన్నారు. సోమవారం ఆమె మార్టేరులో విలేకర్లతో మాట్లాడుతూ సిఎం జగన్ చేస్తున్న బస్సు యాత్రకు రోజు రోజుకు పెరుగుతున్న ప్రజాదరణను సహించలేకే టిడిపి మూకలు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నాయని ఆమె విమర్శించారు. ప్రజాక్షేత్రంలో ఉన్న ముఖ్యమంత్రి పైన దాడులు చేయిస్తున్నవారిని ప్రజలు ఓ కంట కనిపెట్టి, ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు

బాబోయ్ చదువు 'కొన'లేం..!

(మొదటి పేజీ నుంచి)

ఇల్లు, బంగారం వంటి వాటిని తెగనమ్ముకోవాల్సి పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందిస్తే పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడేది. కానీ పాలకులు అటువైపు కనీసం దృష్టి సారించని పరిస్థితి నెలకొంది. ప్రయివేటు స్కూళ్ల దోపిడీపై ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇంటర్ విద్యలో ఫీజుల దోపిడీ

ఇంటర్ విద్య పేరుచెబితే తల్లిదండ్రులు హడలిపోతున్నారు. ప్రయివేటు జూనియర్ కాలేజీల్లో ఫీజులు చూసి ఖంగుతింటున్నారు. డేస్ కాలర్‌కు కనీసంగా రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకూ వసూలు చేస్తున్నారు. పుస్తకాలు, ఇతర ఫీజుల పేరుతో మరో రూ.20 వేల నుంచి రూ.30 వేలు లాగేస్తున్నారు. డేస్ కాలర్‌గా చదివిస్తే విద్యార్థికి ఏడాదికి రూ.లక్షల వరకూ ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక హాస్టల్లో చేరితే రూ.రెండున్నర లక్షల వరకూ వసూలు చేస్తున్నారు. ఇందులో ఎంసెట్, జెఇఇ మెయిన్స్, ఐఐటి అంటూ ఫీజుల బాదుడు కొనసాగిస్తున్నారు. బాగా చదివే విద్యార్థులను తక్కువ ఫీజుకు చేర్చుకుని వారు సాధించిన ర్యాంకులను ప్రచారం చేసుకుంటూ భారీగా ఫీజులు వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఇంత పెద్దమొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న కాలేజీల్లో ఎటువంటి సౌకర్యాలు ఉంటున్నాయో కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇంటర్ విద్యను చెప్పించాలంటే తల్లిదండ్రులు ఉన్న ఆస్తులను సైతం అమ్ముకోవాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. ప్రభుత్వం విద్యను నిర్వీర్యం చేయడం కారణంగా ప్రయివేటు, కార్పొరేట్ యాజమాన్యాలు ఇష్టానుసారంగా రెచ్చిపోయి జనాన్ని పీడించుకుతింటున్న పరిస్థితి నెలకొంది.

18 నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం

(మొదటి పేజీ నుంచి)

దాఖలు చేయొచ్చని తెలిపారు. రెండు కంటే ఎక్కువ నియోజకవర్గాల నుండి అభ్యర్థులు నామినేషన్లను ఫైల్ చేయలేరని పేర్కొన్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో గరిష్టంగా మూడు వాహనాలు అనుమతించబడతాయని, ఐదుగురు (అభ్యర్థితో సహా) ఆర్ఒ ఆఫీసులోకి అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థి సువిధ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో నామినేషన్లు సమర్పించవచ్చని, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య అభ్యర్థి లేదా అతని ప్రపోజర్ లేదా అతని ఏజెంట్ ద్వారా చేతితో డెలివరీ చేయబడిన క్యూ ఆర్ కోడ్‌తో కూడిన ప్రింట్‌అవుట్ సంతకం చేయబడిన సిరాతో నామినేషన్ సమర్పించవచ్చన్నారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి ఒక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ప్రేమ పేరుతో మోసం

(మొదటి పేజీ నుంచి)

స్థలానికి చేరుకున్నారు. ఇక్కడ ఆందోళన చేయడానికి వీల్లేదని పోలీసులు చెప్పడంతో తాను ఎటువంటి కేసు పెట్టలేదని, న్యాయం జరిగే వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదని బాధితురాలు తేల్చిచెప్పారు. అయితే సాయి కుటుంబ సభ్యులు పరారీలో ఉన్నారు. వారికి పోలీసులు సహకరిస్తున్నారని బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

జిల్లాలోకి ప్రవేశించిన సిఎం బస్సు యాత్ర

(మొదటి పేజీ నుంచి)

నిమిషయంలో మళ్లీ కరెంట్ రావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.జనానికి సిఎం అభివాదం చేస్తూ తన బస చేసే ప్రాంతానికి చేరుకున్నారు.

వైసిపి కార్యకర్తకు గాయాలు

సిఎం బస్సు యాత్రలో పాల్గొని బైక్‌పై వెళ్తుండగా భీమడోలు చేరే సరికి సిఎం కాన్వాయ్ వాహనాలు ఒక్కసారి ఆగడంతో బైక్‌పై ఉన్న కార్యకర్త వాహనాన్ని గుద్దుకుని వాహన అద్దాల్లోకి ఇరుక్కుపోయి తీవ్ర గాయాలైనట్లు తెలిసింది. అతను కైకరానికి చెందిన వ్యక్తిగా చెబుతున్నారు. అతనిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. పూర్తి వివరాలు బయటకు రాలేదు.

నిర్మానుష్యంగా ఉన్న బస్టాండ్

బస్సుల్లేక ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి - నరసాపురం

ఏలూరు, కృష్ణ జిల్లాలో సిఎం జగన్మోహన్ రెడ్డి నిర్వహించిన బస్సు యాత్రకు నరసాపురం డిపో నుంచి 20 బస్సులు వెళ్లాయి. మంగళవారం జరిగే బస్సు యాత్రకు 30 బస్సులు వెళ్తాయని ఆర్‌టిసి అధికారులు తెలిపారు. ప్రయాణాలు చేసేందుకు సిద్ధమైన ప్రయాణికులకు బస్సులు లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు. సోమవారం నరసాపురం బస్టాండ్ ప్రాంతమంతా నిర్మానుషంగా మారింది. వచ్చిన ప్రయాణికులు గంటల కొద్ది వేచి ఉండాల్సి వచ్చింది. కొంతమంది ఆర్‌టిసి బస్సులు లేకపోవడంతో ప్రయివేట్ వాహనాలను ఆశ్రయించారు.

'సిద్ధం' సభకు తరలివెళ్లాలి

వైసిపి ఆచంట అసెంబ్లీ అభ్యర్థి చెరుకువాడ

ప్రజాశక్తి - పెనుమంట్ర

భీమవరంలో ఈనెల 16వ తేదీ మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు జరుగనున్న మేమంతా సిద్ధం బస్సు యాత్ర సభ, రోడ్ షోకి ఆచంట నియోజకవర్గ ప్రజలు సిద్ధం కావాలని వైసిపి ఆచంట అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. నియోజకవర్గంలోని ఆచంట, పెనుమంట్ర, పెనుగొండ, పోడూరు మండలాల అన్ని గ్రామాల నుంచి వివిధ హోదాల నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

జనసేనలోకి పలువురు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గ్రామపంచాయతీలోని నిధులను దారి మళ్లించి గ్రామాల అభివృద్ధిని ముఖ్యమంత్రి జగన్ నిర్వీర్యం చేశారని జనసేన తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. జనసేన సిద్ధాంతాలు నచ్చి వైసిపి నుంచి పెంటపాడు మండలం ప్రతిపాడు గ్రామ వైసిపి నాయకుడు మజ్జి అప్పారావు తన అనుచరులతో కలిసి జనసేనలో చేరారు. సోమవారం జనసేన కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో బొలిశెట్టి మాట్లాడుతూ తాగునీరు, రోడ్లు సైతం వేయలేని స్థితిలో ఈ ఐదేళ్ల పరిపాలన కొనసాగిందని, దీనికి చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. జనసేనలోకి వచ్చిన ప్రతి కార్యకర్త కష్టాల్లోనూ నేను ఉంటానని భరోసా ఇచ్చారు. జనసేన కుటుంబం జగమంత కుటుంబంగా మారిందని తాడేపల్లిగూడెంలో వైసిపి ఖాళీ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోట గోపి, పైబోయిన రఘు, పైబోయిన వెంకటరామయ్య, వర్తనపల్లి కాశీ, పుల్ల బాబి, జగత సోమశేఖర్, వీర్ల కృష్ణ పాల్గొన్నారు.

బండారును కలిసిన బన్నీవాసు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవ నాయుడుని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బన్నివాసు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురు ప్రస్తుత రాజకీయాలపై చర్చించుకున్నారు. రాజకీయాల్లో పోటీ చేస్తాను, మద్దతు ఇస్తాను అని తెలిపిన మాధవనాయుడిని బన్నీ వాసు కలవడం చర్చనీయాంశంగా మారింది. కొద్దిరోజుల క్రితమే చంద్రబాబు అమలాపురంలో మాధవనాయుడు

డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాలి

ఆకివీడు ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి ఆకివీడు

పట్టణంలోని డంపింగ్ యార్డ్ అక్కడ ప్రజలకు నరకప్రాయంగా మారుతోంది. నగర పంచాయతీ స్థాయి రోజురోజుకీ పెరుగుతోంది ఆ మేరకు అవసరాలు పెరుగుతున్నాయి. అయితే ఆ ద్వారా వస్తున్న ఆదాయం నగర పంచాయతీ తీసుకుంటుంది తప్ప ప్రజలకు వసతులు మాత్రం కల్పించడం లేదన్నది ఇక్కడ సర్వత్రా వస్తున్న విమర్శలు. అందులో భాగంగానే అత్యంత ప్రధానమైన డంపింగ్ యార్డ్ సమస్య ఆకివీడుని ఏళ్ల తరబడి పట్టిపీడిస్తోంది. ఒకటి చెత్త రోడ్డు మీదకి రావడం, ఆ చెత్త మీద ప్రయాణ వాహనాలు జారి పడిపోవడంతో దెబ్బలు తగలడం ఒక అంశం. మరొకటి చెత్త నుంచి వచ్చే దుర్వాసన, అంటించినప్పుడు వచ్చే పొగ, ఈ రెండు మరింత దారుణమైన సమస్యలుగా మారాయి. ఆ పరిసరాల్లో నివసించే వాళ్లు ఇళ్లు ఖాళీ చేసే పరిస్థితి ఏర్పడింది. పంచాయతీగా ఉండగానే ఈ సమస్య తలెత్తింది. అయితే అప్పట్లో సర్పంచి గొంట్ల గణపతి, కార్యదర్శి దాగూర్లు చాకచక్యంగా వ్యవహరించి పని జరిపించారు. రోడ్డు పక్కగా పొలాల మధ్యలో ఉన్న పంచాయతీ పోరంబోకు స్థలంలోకి చెత్త మళ్లిస్తామని అక్కడ వారిని ఒప్పించారు. ఆ మేరకు కొంతమేర లోపలికి మళ్లించారు. అంతలో పంచాయతీ కాస్తా నగర పంచాయతీగా మారింది. లోపల ఆక్రమణదారుల నుంచి భూమిని శోధన చేసుకోలేకపోయారు. నగర పంచాయతీ ఏర్పడిన సుమారు సంవత్సరంనర కాలం పైబడి అధికారుల పాలనలోనే కొనసాగింది. అప్పుడు ఎన్నోసార్లు ప్రజలు విజ్ఞాపన సమర్పించారు. అయినా ఫలితం లేదు. ఇటీవల మున్సిపాలిటీ పాలకవర్గ ఏర్పడింది. అనంతరం తరచూ ఈ సమస్యపై ప్రజలు పోరాడుతూనే ఉన్నారు. ఇటీవల ఆ చెత్త రోడ్డు మీదకు రావడంతో ఆ మార్గంగా ప్రయాణించే కొల్లేరు గ్రామాల ప్రజలు కూడా తిరుగుబాటు చేశారు. ప్రధాని రహదారిని స్తంభింపజేశారు. ఎన్నోసార్లు ఎన్నో ప్రయత్నాలు చేసినా ఫలితం మాత్రం దక్కలేదు. దుర్వాసన, దారుణమైన పొగ. వీటితో అక్కడ ప్రజలు అనారోగ్యం, తీవ్ర జబ్బులమయంతో ఇబ్బంది పడుతున్నారు. ఆ రహదారి గుండా గ్రామాలకు వెళ్లే సుమారు 10 గ్రామాల ప్రజలకు అక్కడ చెత్త అంటించినప్పుడు వచ్చే పొగతో కళ్లు కనిపించవు. వారికి కూడా అనారోగ్యాలు పాలవుతున్నారు. ప్రమాదాలకు నెలవుగా మారుతుంది. అధికారులు ఇప్పటికైనా పట్టించుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. లేనిపక్షంలో మరోసారి తీవ్ర ఆందోళన చేపట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

డంపింగ్‌యార్డ్ నుంచి వస్తున్న పొగతో ప్రయాణికుల ఇక్కట్లు

ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు అవార్డులు

కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు

భీమవరం రూరల్: భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎసిఐసి సెంటర్‌కు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇంకు బేషన్ సెంటర్ నుంచి రెండు అవార్డులు లభించాయని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు వెల్లడించారు. కళాశాలలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఎసిఐసి సెంటర్ ఏర్పాటుకు బాగా కృషి చేసినందుకు గాను కళాశాలకు బెస్ట్ స్టార్టప్ ఎకో సిస్టం ఎనేబులర్ అవార్డు, దీనికి కృషి చేసినందుకు సివిల్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ నంద్యాల శివ కిషన్‌కు వ్యక్తిగత విభాగంలో బెస్ట్ స్టార్టప్ ఎకో సిస్టం ఎనాబులర్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఎసిఐసి సెంటర్ కార్యకలాపాలాలు పర్యవేక్షిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ నంద్యాల శివ కిషన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం 2017లో అటల్ ఇంకిబేసిన్ సెంటర్ ఏర్పాటు చేసిందన్నారు. అప్పటి నుంచి ఆ సెంటర్ ద్వారా రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల్లో ఇన్నోవేషన్ కార్యక్రమాలను ప్రోత్సహిస్తుందన్నారు. ఈ సెంటర్ సహకారంతో తమ కళాశాలలో కూడా విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించడం జరిగింది. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ వార్షిక స్టార్టప్ జాతర కార్యక్రమంలో తమ కళాశాలలో ఇన్నోవేషన్ కార్యక్రమాలు, అంకుర సంస్థల స్థాపనకు గుర్తింపుగా అవార్డులు అందించారని తెలిపారు. ఈ అవార్డులు అటల్ ఇన్నోవేషన్ మిషన్ వ్యవస్థాపక డైరెక్టర్ రమణన్ రామనాథన్ కళాశాలకు అందించారని చెప్పారు. నీతి ఆయోగ్ వారి అటల్ ఇన్నోవేషన్ మిషన్ ద్వారా తమ కళాశాలలో స్థాపించే అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటుకు ఇప్పటికే రూ.ఐదు కోట్లు నిధులు మంజూరు అయ్యాయని, త్వరలో పూర్తిస్థాయి కార్యక్రమాలు కూడా నిర్వహించి ఇన్నోవేషన్ సెంటర్లను తమ కళాశాల విద్యార్థులకు, సిబ్బందికి కాకుండా ఇతర విద్యార్థులకు, సిబ్బందికి కూడా అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా శివకిషన్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు అభినందించారు.

వైసిపి పాలనకు చరమగీతం

జనసేన అభ్యర్థి రామాంజనేయులు

భీమవరం రూరల్: వచ్చేనెల ఈ సమయానికి వైసిపి అంకం ముగిసిపోతుందని, నెల రోజుల్లో 5 సంవత్సరాల దుష్ట పాలనకి చరమాంకమేనని మాజీ ఎంఎల్‌ఎ, జనసేన భీమవరం ఎంఎల్‌ఎ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. సోమవారం భీమవరం 27వ వార్డుకు చెందిన కోడి వెంకట్ తనయుడు కోడి రాజు, బండి రమేష్ ఆధ్వర్యంలో 400 మంది శ్రేణులు జనసేనలోకి నరసాపురం ఎంపి కనుమూరి రఘురామ కృష్ణంరాజు, ఉమ్మడి ఎంఎల్‌ఎ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు, జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, పట్టణ అధ్యక్షులు చెన్నమల చంద్రశేఖర్ సమక్షంలో పార్టీలోకి చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌ఎ అంజిబాబు మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గం నుంచి వైసిపిని తరిమికొడదామని, టిడిపి, జనసేన సమన్వయంతో వ్యూహాత్మకంగా అడుగులు వేయాలని అన్నారు. ఏ ఒక్క నాయకుడు, కార్యకర్త త్యాగాన్నీ, కష్టాన్నీ మరచిపోమని, వచ్చేది కూటమి ప్రభుత్వమేనని, నాయకులు, కార్యకర్తల బాధ్యతగా సమిష్టిగా పని చేద్దామని అన్నారు. వైసిపి ఐదేళ్ల పాలన అంతా విధ్వంసం, అరాచకమేనన్నారు. ఐదేళ్ల నరకానికి స్వస్తి పలికే సమయం ఆసన్నమైందని, గెలిపించాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట

రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని, ఆర్థిక పరిపుష్టి పొందాలని ఇన్‌ఛార్జి మండలం వ్యవసాయ అధికారి బి.నాగరాజు అన్నారు. కొడమంచిలి సొసైటీ కార్యాలయం వద్ద సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారి బి.నాగరాజు మాట్లాడుతూ రైతులందరూ కోతలు పూర్తయిన వెంటనే ధాన్యాన్ని ఆరబెట్టుకుని తేమ శాతాన్ని పరీక్షించుకోవాలని తెలిపారు. తేమ శాతం 17 కంటే మించకుండా ఉండాలన్నారు. ఈ సందర్భంగా రైతులందరూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కాళ్ళకూరి నాగేశ్వరరావు, నవీన్, శ్రీదేవి, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

తనిఖీ చేస్తున్న డాగ్ స్క్వాడ్

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు..

ప్రజాశక్తి - ఉండి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బస్సు యాత్రలో భాగంగా మంగళవారం ఉండి మండలంలో పర్యటిస్తున్న నేపథ్యంలో స్థానిక కోట్ల ఫంక్షన్ హాల్ వద్ద వైసిపి నేతలు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి శ్రీహరి నారాయణరాజు మాట్లాడుతూ మంగళవారం మధ్యాహ్నం ఉండి మండలంలో బస్సు యాత్ర జరుగుతుందని, దీనికి సంబంధించి కోట్ల ఫంక్షన్ హాల్ వద్ద ముఖ్యమంత్రి భద్రత దృష్ట్యా డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేసినట్లు ఆయన తెలిపారు. స్థానిక వైసిపి నేతలు ముఖ్యమంత్రి పర్యటనలో పాల్గొన్న నాయకులకు, కార్యకర్తలకు భోజనం వసతి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, నాయకులు సూరవరపు వెంకటాచార్యులు, గళావిల్లి ధనుంజయ, అంగర రాంబాబు, రాయి సతీష్ పాల్గొన్నారు.

అగ్నిమాపక ప్రమాదాలపై అవగాహనుండాలి

అగ్నిమాపక అధికారి కె.భాస్కర్ రామ్

ప్రజాశక్తి - నరసాపురం

అగ్నిమాపక ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నరసాపురం అగ్నిమాపక అధికారి కె.భాస్కర్ రామ్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా సోమవారం బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్, మెయిన్ రోడ్డులోని ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కె.భాస్కర్ రామ్ మాట్లాడుతూ వేసవి కాలంలో అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

జనసేనలోకి కాశీ విశ్వనాథ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అవినీతి రహిత పరిపాలన అందించడం ద్వారా తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా నిలుపుతానని, గాజు గ్లాసు గుర్తుపై ఓటేసి గెలిపించాలని జనసేన నియోజకవర్గ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక 27వ వార్డు ఉంగరాల వారి వీధిలో వైసిపి మాజీ పట్టణ యూత్ సెక్రెటరీ ఉంగరాల కాశీ విశ్వనాథ్ తన అనుచరులతో జనసేనలో చేరారు .ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడతూ ఐదేళ్ల కాలంలో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిపోయిందని, అవినీతిలో మాత్రం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా జనసేనలో నూతనంగా చేరిన వారిని బొలిశెట్టి పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పలువురు ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఎంపిపి ఎం.సోనియా అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ జల జీవన్ మిషన్‌లో పైపులు వేశారు కాని ఇంటింటికీ కనెక్షన్‌లు ఇచ్చి టాప్‌లు వేయలేదన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపిడిఒ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎంవి.రమణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ తాడి లోకేష్ మాట్లాడుతూ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా వేసవికాలంలో తాగునీరు అందిస్తామని తెలిపారు.

ఉపాధి హామీ కూలి రూ.600 ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి

చాట్రాయి : కూలీలతో మాట్లాడుతున్న ఎ.రవి

ప్రజాశక్తి - చాట్రాయి

ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న రోజువారి కూలీలకు రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన చాట్రాయి గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ సమీపంలో పంట కాలువల పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలతో సోమవారం ఆయన మాట్లాడారు. కేంద్రంలో రానున్న రోజుల్లో బిజెపి అధికారంలోకొస్తే ఉపాధి హామీ పనులు తొలగిస్తుందని, కూలీలు పనులు లేక ఆకలితో అలమటించే రోజులు వస్తాయని చెప్పారు. గతంలో రైతులు వ్యవసాయ పనులు చేయటానికి కూలీలకు పని దినాలు దొరికేవని, ప్రస్తుత కాలంలో యంత్రాల ద్వారా వ్యవసాయ పనులు చేసుకోవడంతో కూలీలకు పని దినాలు తగ్గిపోయాయన్నారు. బడ్జెట్‌లో ఉపాధి హామీ పనులకు తక్కువ బడ్జెట్ కేటాయించడంతో కూలీలకు పని దినాలు తగ్గిపోతాయన్నారు. వంద రోజుల పని దినాలను 200 రోజులకు పెంచాలన్నారు. గతంలో పేస్లిప్పులు ఇచ్చేవారని, వేసవికాలంలో మజ్జిగ, మంచినీళ్ల సౌకర్యాలు కల్పించేవారని, పలుగు, పారా ఇచ్చేవారని, ఇవన్నీ ప్రస్తుతం ఈ పథకంలో నుంచి తొలగించారని, వెంటనే వాటిని మళ్లీ కొనసాగించాలని కోరారు. వేసవికాలంలో ఎండ తీవ్రతకు కొంత కూలి పెంచి ఇచ్చేవారని, ప్రస్తుతం అది కూడా ఇవ్వడంలేదన్నారు. పే స్లిప్పులు ఇవ్వాలని, రోజువారి కూలి రూ.600 ఇవ్వాలని, రెండు వందల రోజులు పని దినాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల మహిళ కార్యదర్శి మేడేపల్లి హెూలీ మేరీ, సిపిఎం మండల కమిటీ సభ్యులు గజవెల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాత మస్టర్ విధానాన్నే కొనసాగించాలి

జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

పోడూరు :ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా మస్టర్లు కూలీలకు శాపంగా మారాయని, పాత మస్టర్ విధానాన్ని కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని పెనుమదం గ్రామంలో ఉపాధి హామీ కూలీలు పని చేస్తున్న ప్రాంతానికి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెళ్లి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పెరిగిన ధరలతో పోలిస్తే వేతనం కేవలం రూ.28 పెంచి బిజెపి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వ్యవసాయ పనులు లేని పరిస్థితి గ్రామీణ ప్రాంతాల్లో వంద నుంచి 200 రోజులకు పని దినాలు పెంచాలన్నారు. బడ్జెట్‌లో 60 శాతం నిధులు లేబర్ కాంపోనెంట్‌కి ఖర్చు పెట్టాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో రూ.రెండు లక్షల కోట్లు కేటాయించి ఉపాధి హామీని బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు సిర్రా విఘ్నేశ్వరరావు పాల్గొన్నారు.

సకాలంలో పనులు కల్పించాలి

తాడేపల్లిగూడెం : ఉపాధి హామీ కూలీలకు సకాలంలో పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు కోరారు. ఈ మేరకు మండలంలోని కొత్తూరు గ్రామంలో ఉపాధి కూలీలు సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ గ్రామంలో చెరువుల లీజు సమయం అవ్వకపోవడంతో చెరువులు ఖాళీలేక ఉపాధి కూలీలకు పనులు లేవన్నారు. దీంతో వారు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని స్థానిక సర్పంచికి వివరించి తక్షణమే వారికి ఉపాధి పనులు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచి కె.హనుమంతు స్పందించి మాట్లాడుతూ లీజుదారుల కాలపరిమితి త్వరలోనే పూర్తి కావస్తుందని, అనంతరం పనులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆకుల ధనలక్ష్మణారావు, వెంకటేశ్వరరావు, తిరుమల వెంకన్న, పురంచెట్టు వెంకటేశ్వరరావు, ఆకుల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఏర్పాటు చేసిన జర్మనీ టెక్నాలజీ టెంట్లు

జగన్ బస్సు పర్యటనకు భారీ బందోబస్తు

ప్రజాశక్తి - ఉంగుటూరు

సిఎం జగన్ సోమవారం రాత్రి నారాయణపురంలో బస చేసేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. నారాయణపురం-భీమవరం ప్రధాన రహదారిలో నారాయణపురం వద్ద వైసిపి నాయకుడికి చెందిన ఐస్ ఫ్యాక్టరీ ఖాళీ మైదానంలో జర్మనీ టెక్నాలజీతో హాంగర్ టెంట్ వేశారు. 22 అడుగుల ఎత్తు, 40 అడుగుల వెడల్పు, 50 అడుగుల పొడవుతో ప్రత్యేక ఎసి టెంట్ ఏర్పాటు చేశారు. అందులోనే జగన్ క్యార్‌వ్యాన్ బస్సులోనే బస చేయనున్నారు. సుమారు 600 మంది పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. నారాయణపురం బజారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డు మార్జిన్‌కు చేర్చి ఉండటంతో బస్సు యాత్ర సమయంలో జనాల రద్దీతో విద్యుదాఘాతం వంటి ప్రమాదం చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న స్కూలు యాజమాన్యం

రాష్ట్రస్థాయిలో హీల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

అంబేద్కర్ స్మారక రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో హీల్ పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. ఈ నెల 12, 13 తేదీల్లో గుంటూరు జిల్లా తెనాలి మండలం వేమూరులో అంబేద్కర్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-18 వాలీబాల్ పోటీల్లో మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో గల హీల్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. వారు ద్వితీయస్థానం సాధించినట్లు ప్రిన్సిపల్ బి.సాయిబాబు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను సిఇఒ కె.అజయ్‌కుమార్, ప్రిన్సిపల్ సాయిబాబు, ఫిజికల్ ఏడ్యుకేషన్ బాధ్యులు అభినందించారు.

పంట కాలువలను పరిశీలిస్తున్న అధికారులు

పంట కాలువల పరిశీలన

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని ప్రధాన వెంకయ్యవయ్యేరు, అన్నయ్యకోడు పంట కాలువలను, బ్రాంచి కాలువలను ఇరిగేషన్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సోమవారం పరిశీలించారు. మండలంలోని మోడి, కలవపూడి, పల్లెపాలెం, ప్రాతళ్లమెరక, జువ్వలపాలెం, ఏలూరుపాడు గ్రామాల్లో పర్యటించి కాలువల స్థితిగతులను పరిశీలించారు. ఇరిగేషన్ డిఇ సత్యనారాయణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ టి.శ్రీనివాసరావు, కలవపూడి గ్రామ సర్పంచి గేదల జాన్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

రైతుభరోసా కేంద్రాల ద్వారా గోనెసంచులు, రవాణా వాహనాలు ఏర్పాటు చేయాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు కౌలు రైతుల సంఘం వినతి

ప్రజాశక్తి - భీమవరం

ధాన్యం కొనుగోలులో మిల్లర్లు దోపిడీ అరికట్టాలని కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో దాళ్వా పంట (రబీ) మాసూలుకు వచ్చిందని, పంటలు పండిస్తున్న కౌలు, పేద రైతులు ధాన్యం నూర్పిడి చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. అయితే రైస్ మిల్లర్లు రైతు భరోసా కేంద్రాల్లో నిర్ధారించిన తేమశాతాన్ని కాని, మినీ మిల్లుల్లో నిర్ధారించిన నూక శాతాన్ని కాని పరిగణనలోకి తీసుకోవడంలేదన్నారు. అదనంగా తేమశాతం, నూకశాతం చూపించి రైతులు డబ్బులు కట్టాలని, లేకపోతే ధాన్యం తీసుకోబోమని ఇబ్బందులు పెడుతూ కౌలురైతుల వద్ద రూ.వేలు దోచుకుంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మిల్లుల వద్ద ఏర్పాటు చేసిన కస్టోడియన్ అధికారులు పట్టించుకోవడం లేదని, దీనికితోడు గోనెసంచులు సకాలంలో ఇవ్వకపోవడం, రైతుభరోసా ద్వారా రవాణా వాహనాలు ఇవ్వకపోవడంతో రైతులు ప్రయివేట్ వ్యక్తులను ఆశ్రయిస్తున్నారన్నారు. ఈ పరిస్థితిని ఆసరా చేసుకుని ప్రయివేట్ వ్యక్తులు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క దాళ్వా పంటకు సాగునీరు అందదనే ఆందోళనతో రైతులు ఎస్ఎల్-10, పిఆర్-126 రకాలు వేశారన్నారు. వ్యవసాయాధికారులు ఎస్ఎల్-10 రకం కొనుగోలుకు అనుమతి లేదని చెబుతున్నారన్నారు. తక్షణమే రైస్ మిల్లర్ల మోసాలు అరికట్టాలని, రైతుభరోసా కేంద్రాల ద్వారా తగినన్ని గోనెసంచులు, రవాణా వాహనాలు ఏర్పాటు చేయాలని, ఎస్ఎల్-10 రకం ధాన్యం కొనుగోలుకు అనుమతించాలని, ధాన్యాన్ని దగ్గరలోని మిల్లులకు ఎంపిక చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందించిన వారిలో జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు ఉన్నారు.

టిడ్కో గృహాల రుణాలు రద్దు చేయాలి

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఐద్వా ఆధ్వర్యంలో మహిళల ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

టిడ్కో గృహాల రుణాలు రద్దు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు టిడ్కో గృహాల వద్ద ఐద్వా ఆధ్వర్యంలో మహిళలందరూ సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ 2019 ఎన్నికల సమయంలో బ్యాంకు రుణాలన్నీ మాఫీ చేస్తానని వాగ్దానాలు చేశారని, ఈరోజు ఆ మాటను పక్కకి నెట్టి రుణాలు కట్టాలని టిట్కో గృహాల్లో నివసిస్తున్న వారిపై ఒత్తిడి తీసుకురావడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఎ బ్లాక్‌లో రుణమాఫీ చేశారని, అలాగే బి బ్లాక్, సి బ్లాక్‌ల్లో కూడా బ్యాంకు రుణాలను రద్దు చేయాలని కోరారు. టిడ్కో గృహాల్లో కనీస వసతులైన తాగునీరు, డ్రెయినేజీ సౌకర్యం కూడా లేవన్నారు. అలాగే వీధిలైట్లు సక్రమంగ పని చేయడం లేదని, పాముల బెడద ఎక్కువగా ఉందని, మహిళలందరూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. సిటీకి దూరంగా ఈ టిడ్కో ఇళ్లు ఇవ్వడం వల్ల రాకపోకలకు ఆటో సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. బ్యాంకు రుణాలను వెంటనే మాఫీ చేసి, కనీస సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బంకుర యశోద, లక్ష్మి, పుష్ప, కుమారి, మహిళలు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మహిళలు

'ఎన్‌డిఎ కూటమిని ఓడించకపోతే నష్టమే'

ప్రజాశక్తి - ముసునూరు

ఎన్‌టిఎ కూటమిని ఓడించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రతి ఒక్క ఓటరు గమనించి ఓటు వేయాలని సిపిఎం ఏలూరు జిల్లా నాయకులు అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ పదేళ్ల నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పరిపాలన రైతులను, కార్మికులను, కర్షకులను, సామాన్య, పేద, బడుగు, బలహీనులను ఇబ్బందులకు గురి చేసేలా సాగిందన్నారు. పన్నుల పేరిట, జిఎస్‌టి పేరిట దోచుకున్నారన్నారు. ఈసారి బిజెపిని ఓడించకపోతే నియంతృత్వ పరిపాలన చేస్తుందన్నారు. ప్రతిఒక్కరూ ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల పిల్లి మురళి, కంచర్ల శ్రీను, కంచర్ల దుర్గారావు, పిన్నిబోయిన శ్రీను, కంచర్ల పోతురాజు, కంచర్ల సత్యనారాయణ, కె.రామకృష్ణ, కుటుంబరావు పాల్గొన్నారు.

వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండలంలో పలు గ్రామాలకు చెందిన వాలంటీర్లు రాజీనామాలు చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను పంచాయితీ కార్యదర్శులకు అందించారు. వడ్లమాను, ఈదర-1, 2, కృష్ణవరం, చొప్పరమెట్ల, కనసానపల్లి, బొద్దనపల్లి, ఆగిరిపల్లి-1, 2లకు సంబంధించిన 70 మంది వాలంటీర్లు రాజీనామాలు చేశారు. మండలంలో మొత్తం ఇప్పటివరకు 120 మంది రాజీనామాలు చేసినట్లు ఎంపిడిఒ పి.శామ్యూలు తెలిపారు.

ఉండి :సిఎం జగన్‌ను రెండోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఆయన తరఫున ప్రచారం చేసేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని ఉండి గ్రామ వాలంటీర్లు అన్నారు. ఉండి గ్రామానికి చెందిన వాలంటీర్లు సోమవారం మూకుమ్మడి రాజీనామాలు చేశారు. ఈ సందర్భంగా రాజీనామా పత్రాలను గ్రామపంచాయతీ కార్యదర్శి కేశిరెడ్డి గోపాలకృష్ణకు అందించారు.